

3 నుంచి నృసింహ దీక్షలు

సింహాచలం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హైందవ ధర్మ పరిరక్షణ, సింహాచలం క్షేత్ర మహాత్మ్యం ప్రచారానికి ఉద్దేశించిన నృసింహ దీక్షలకు డిసెంబరు 3వ తేదీన శ్రీకారం చుట్టనున్నట్టు దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్.సుజాత ప్రకటించారు. దేవాలయ వైదిక కమిటీ నిర్ణయం మేరకు సంప్రదాయ విధానంలో మాలధారణ ప్రారంభమవుతుందన్నారు. జనవరి 12న దీక్షల విరమణ జరుగుతుందన్నారు. ద్వాత్రింశతి దీక్షలు డిసెంబరు 11న ప్రారంభమై జనవరి 12న పరిసమాప్తమవుతాయన్నారు. దీక్షలు స్వీకరించు భక్తులకు ఉచితంగా తులసి మాలలు, స్వామివారి ప్రతిమలను అందజేస్తామన్నారు.

పీపీపీపై పెదవివిరుపు

నగరంలో 54 రహదారులను ఎంపిక చేసిన జీవీఎంసీ

నిర్మాణంతో పాటు పదేళ్ల పాటు నిర్వహణ బాధ్యతలు అప్పగింత

- నిర్మాణం పూర్తయిన వెంటనే 40 శాతం బిల్లు చెల్లింపు
- మిగిలిన 60 శాతం పదేళ్లపాటు ఏటా కొంత జమ
- ఆ రోడ్లపై హోర్డింగ్‌లు, ఇతర ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయం కూడా కాంట్రాక్టర్‌కే చెందేలా నిబంధనలు



సంపత్ వినాయకుని ఆలయం రోడ్డు

- అలాగైతే జీవీఎంసీ ఆదాయానికి భారీగా గండి
- ఇండోర్‌లో ప్రకటనల ఆదాయంతోనే రోడ్లు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్లు
- స్థానిక సంస్థపై పడని అదనపు భారం
- జీవీఎంసీలో కూడా అదే తరహాలో అమలు చేయాలని డిమాండ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో ప్రధాన రహదారులను పీపీపీ యాన్యుటీ/హైబ్రిడ్ యాన్యుటీ మోడల్‌లో అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రోడ్ల నిర్వహణను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించినా జీవీఎంసీ అధికారుల పర్యవేక్షణ ఉండాలని కొందరు అభిప్రాయపడుతున్నారు. అయితే కాంట్రాక్టర్‌కు నిర్మాణం, నిర్వహణకు అయ్యే వ్యయాన్ని చెల్లిస్తూ కూడా...ఆ మార్గంలో ప్రకటనల ద్వారా ఆదాయం సమకూర్చుకునే అవకాశాన్ని కల్పించాలనే నిర్ణయాన్ని తప్పుపడుతున్నారు.

జీవీఎంసీ పరిధిలో 54 ప్రధాన రహదారులను పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) యాన్యుటీ/హైబ్రిడ్ యాన్యుటీ మోడల్‌లో అభివృద్ధి చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ విధానంలో ఎంపిక చేసిన రోడ్ల నిర్మాణం, పదేళ్లపాటు నిర్వహణ బాధ్యతలను కాంట్రాక్టర్‌కు అప్పగిస్తారు. ఆ రోడ్డు నిర్మాణం పూర్తయిన అనంతరం ఖర్చులో 40 శాతం జీవీఎంసీ చెల్లిస్తుంది. మిగిలిన మొత్తాన్ని పదేళ్లపాటు విడతల వారీగా విడుదల చేస్తుంది. ఆ పదేళ్లలో రహదారి ఎక్కడైనా దెబ్బతింటే దానిని పునర్నిర్మించే బాధ్యత సంబంధిత కాంట్రాక్టర్‌దే. ఒకవేళ రోడ్డు నిర్వహణను కాంట్రాక్టర్ సరిగా చేయలేకపోతే బిల్లు చెల్లింపు నిలిపివేస్తారు. కాంట్రాక్టర్‌కు బిల్లు రాదేమోననే భయం ఉంటుంది కాబట్టి, రోడ్డు నిర్మాణంలో నాణ్యతతోపాటు నిర్వహణ కూడా బాగుంటుందని అధికారులు చెబుతున్నారు. దీనికి అనుగుణంగా జీవీఎంసీ జోన్-2లో 31.61 కిలోమీటర్లు, జోన్-3 పరిధిలో 14.24 కిలోమీటర్లు, జోన్-4 పరిధిలో 8.65 కిలోమీటర్లు, జోన్-6లో 30.15 కిలోమీటర్లు మొత్తం 88.35 కిలోమీటర్లు పొడవు గల 54 రోడ్లను పీపీపీ కింద అప్పగించే అంశాన్ని ఈనెల 21న జరిగిన కౌన్సిల్ సమావేశంలో అధికారులు ప్రవేశపెట్టారు. దీనిపై చర్చ సందర్భంగా కొందరు సభ్యులు అనుమానాలు వ్యక్తంచేశారు. కాంట్రాక్టర్‌కు 60 శాతం బిల్లు పదేళ్ల వరకు అందకపోతే నష్టం వస్తుందని తెలిసినా ఎందుకు ముందుకువస్తారని ప్రశ్నించారు. దీనికి కమిషనర్ సమాధానం ఇస్తూ పదేళ్లపాటు బిల్లు పెండింగ్‌లో ఉండిపోతుంది కాబట్టి, ఆ ... మిగతా 4వ పేజీలో

పీపీపీ యాన్యుటీ కింద అభివృద్ధి చేసే రోడ్లు(కి.మీ)

జోన్-2	31.61
జోన్-3	14.24
జోన్-4	8.65
జోన్-5	3.70
జోన్-6	30.15
మొత్తం	88.35 కిలోమీటర్లు

జనవరిలో పలు ప్రధాన రైళ్లు రద్దు

విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే పరిధిలో గోదావరి-రాజమండ్రి, రాజమండ్రి-కడియం సెక్షన్లలో ఆధునీకరణ నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో జనవరిలో పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నామని వాల్తేరు సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు.

జనవరి 27న తిరుపతి-పూరి ఎక్స్‌ప్రెస్ (17480), 28న పూరి-తిరుపతి (17479), తిరుపతి-విశాఖ డబుల్ డెక్కర్ (22708); 28, 29 తేదీల్లో విశాఖ-లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12805), మచిలిపట్నం-విశాఖ ఎక్స్‌ప్రెస్ (17219); 29న విశాఖ-తిరుపతి డబుల్ డెక్కర్ (22707), 29, 30 తేదీల్లో లింగంపల్లి-విశాఖ జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12806), విశాఖ-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ (17220), 28, 30 తేదీల్లో గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17239), 29, 31 తేదీల్లో విజయవాడ-విశాఖపట్నం రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12718), విశాఖపట్నం-విజయవాడ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12717), విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240), రాజమండ్రి-విశాఖ మెము పాసింజర్ (67285), విశాఖ-రాజమండ్రి మెము పాసింజర్ (67286), జనవరి 31న గుంటూరు-విశాఖ డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22876), విశాఖ-గుంటూరు డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22575) రద్దు కానున్నట్టు పేర్కొన్నారు.

కొండపై బదిలీల్లో స్వల్పమార్పులు

విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సింహాచలం దేవస్థానంలో ఓ ఏఈఓ అన్నీ తానై వ్యవహరిస్తున్నారని, పాలనా అవసరాల పేరుతో పలువురు ఉద్యోగులను ఆకస్మికంగా బదిలీ చేశారంటూ 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంపై దేవదాయ శాఖ అధికారులు గురువారం స్పందించారు. నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం ఆలయానికి ... మిగతా 4వ పేజీలో

ప్చ్...టీడీఆర్‌లా!

- డిమాండ్ శూన్యం
- మార్కెట్‌లో అమ్ముకుంటే వచ్చేది 40 శాతమే
- అందుకే భూములు ఇవ్వడానికి ముందుకురాని యజమానులు
- బాండ్ల వల్ల ప్రయోజనం చేకూరేలా నిర్ణయం తీసుకోవాలని సూచనలు
- అప్పుడు ప్రాజెక్టులకు కదలిక



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అభివృద్ధి పనుల కోసం ప్రజల నుంచి సేకరిస్తున్న భూములకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం ఇస్తున్న ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్)కు మార్కెట్‌లో పెద్దగా డిమాండ్ లేదు. వాటిని అమ్ముకుంటే అందులో కేవలం 40 శాతమే వస్తోంది. దాంతో భూములు ఇచ్చినవారు నష్టపోతున్నారు. ఈ విధానం పెద్ద లాభదాయకం కానందున చాలామంది భూములు ఇవ్వడానికి వెనుకంజ వేస్తున్నారు.

గతంలో వైసీపీ ప్రభుత్వం టీడీఆర్‌ల పేరుతో భారీ కుంభకోణాలకు తెర తీసింది. వాస్తవానికి రహదారుల విస్తరణ, అభివృద్ధి పనులకు భూములు తీసుకున్నప్పుడే టీడీఆర్‌లు ఇచ్చే విధానం అమలులో ఉంది. దానిని వైసీపీ ప్రభుత్వం ఇష్టానుసారం దుర్వినియోగం చేసింది. ఎక్కడైనా మార్కెట్ యార్డులు, ఇతర నిర్మాణాలు చేపట్టాలంటే వాటికి కూడా భూమి తీసుకొని టీడీఆర్‌లు ఇచ్చేసింది. ఇది నిబంధనలకు విరుద్ధం. ఈ విధంగా వైసీపీ నాయకుల వేల కోట్ల రూపాయల టీడీఆర్లు దుర్వినియోగం చేశారు. విశాఖపట్నంలో అయితే కొన్ని దశాబ్దాల క్రితం నిర్మించిన రహదారులకు భూములు ఇచ్చామని టీడీఆర్‌లు కొట్టేశారు. దీంతో వాటిపై ప్రజలకు విశ్వాసం పోయింది.

మార్కెట్‌లో డిమాండ్ శూన్యం

ఎక్కడైనా రహదారి విస్తరణ, నిర్మాణంలో భూమిని కోల్పోతే ఆ భూమికి నాలుగింతల విస్తీర్ణంలో ఎక్కడైనా అదనపు నిర్మాణం చేసుకోవడానికి టీడీఆర్‌లు ఇస్తున్నారు. వీటిని రియల్ ఎస్టేట్ వ్యాపారులైన బిల్డర్లే అధికంగా కొంటారు. వ్యక్తిగత గృహాలు నిర్మించుకునే వారికి పైన మరో అంతస్థు వేసుకోవడానికి భారీ టీడీఆర్‌లు అవసరం ఉండదు. అదే బిల్డర్లు అయితే పైన మరో రెండు అంతస్థులు (ఫ్లోర్లు) వేసుకుంటే అందులో అధమంగా ఎనిమిది నుంచి పన్నెండు ఫ్లాట్లు వస్తాయి. వాటిని అమ్ముకుంటే భారీగా లాభం వస్తుంది. అందుకని వారే కొంటారు. ప్రస్తుతం అన్ని అనుమతులతో నిర్మించిన అపార్టుమెంట్లలోనే ఫ్లాట్లు అమ్ముడుపోవడం లేదు. మార్కెట్ డౌన్‌లో ఉంది. అందువల్ల సన్నటి రోడ్లలో అదనంగా అంతస్థులు వేస్తే వాటిని కొనడానికి ఎవరూ వచ్చే అవకాశాలు లేవు. దాంతో టీడీఆర్‌లకు డిమాండ్ కరవైంది. దీనిని ఆసరాగా తీసుకొని భూయజమానుల అవసరాలను బట్టి టీడీఆర్ విలువలో 38 నుంచి 40 శాతం ఇచ్చి కొందరు కొంటున్నారు. అంటే రూ.50 లక్షల విలువైన టీడీఆర్‌కు రూ.20 లక్షలు నుంచి రూ.22 లక్షలు మాత్రమే వస్తోంది. దాంతో టీడీఆర్‌లు పొందినవారు నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో ఎక్కడైనా ప్రభుత్వం భూమి సేకరించినప్పుడు టీడీఆర్‌లు ఇస్తామంటే వారు అంగీకరించడం లేదు. ప్రస్తుతం మాస్టర్ ప్లాన్ రహదారులకు వీఎంఆర్‌డీఏ భారీగా భూమిని సేకరిస్తోంది. అయితే టీడీఆర్‌లకు భూములు ఇవ్వబోమని 50 శాతం మంది తెగేసి చెబుతున్నారు. ఇవ్వక తప్పదని తెలిసి కొందరు ముందుకువస్తే... వాటి రిజిస్ట్రేషన్‌కు గతంలోలా గిఫ్ట్ డీడ్ కాకుండా కన్వేయెన్స్ డీడ్ చేయాలని, 4.5 శాతం స్టాంపు డ్యూటీ కట్టాలని ... మిగతా 4వ పేజీలో

సంకల్ప్‌తో సంసిద్ధం

- ఇంటర్‌లో మెరుగైన ఫలితాల సాధనకు 50 రోజుల యాక్షన్‌ప్లాన్
- ఉదయం తరగతులు, మధ్యాహ్నం సాధన
- జిల్లాలో 10 జూనియర్ కళాశాలలు, 5,358 మంది విద్యార్థులు



మద్దిలపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): **ఇంటర్ విద్యలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం నిర్దేశించిన సంకల్ప్-2026 కార్యక్రమం జిల్లాలో ప్రారంభమైంది. ఇంటర్ బోర్డు విడుదల చేసిన 50 రోజుల ప్రణాళికతో కూడిన షెడ్యూల్ ప్రకారం బోధన చేపడుతున్నారు. ఈనెల 24 నుంచి ఫిబ్రవరి 20వ తేదీ వరకు బోర్డు అందించిన షెడ్యూల్‌ను జిల్లాలోని పది జూనియర్ కళాశాలల్లో పక్కాగా అమలు చేయాలని ప్రిన్సిపాల్స్‌కు ఇప్పటికే జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి పి.ఉమారాణి ఆదేశాలిచ్చారు.**

సంకల్ప్-2026 ప్రణాళిక ప్రకారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.40 గంటల వరకూ పాఠ్యాంశాలను బోధిస్తారు. మధ్యాహ్నం 1.20 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాధన, ఇతర టెస్టులు నిర్వహణ. డిసెంబరు 15 నుంచి ఫిబ్రవరి 20 వరకు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహిస్తారు. డిసెంబరు 22 నుంచి ఫిబ్రవరి 20 వరకు ప్రత్యేక తరగతులు కూడా నిర్వహిస్తారు. కాగా జిల్లాలోని పది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొత్తం 5,358 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరంతా ఉత్తీర్ణత సాధించేలా డీఐఈవో ఉమారాణి ప్రత్యేక దృష్టిసారించారు.

నాలుగు కేటగిరీలు..

సంకల్ప్-26లో భాగంగా జిల్లాలో ఇంటర్ ఉత్తీర్ణత శాతం మెరుగుపరచడానికి పటిష్ఠ చర్యలు చేపట్టారు. కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులను ఎ,బి,సి,డి కేటగిరీలుగా విభజించారు. ఎ కేటగిరీ విద్యార్థులకు ప్రత్యేక రివిజన్ క్లాసులు, బీ, సీ, డీ కేటగిరీ విద్యార్థులు లాంగ్ ఆన్సర్, రెండు షార్ట్ ఆన్సర్ ప్రశ్నలను నేర్చుకునే విధంగా బోధన పద్ధతులు అమలుచేస్తున్నారు. పరీక్షల్లో వచ్చే ముఖ్యమైన ప్రశ్నలను ఇంటర్ బోర్డు తయారు చేసి కళాశాలలకు మెటీరియల్ పంపింది. దీనిని అధ్యాపకులు విద్యార్థులకు ... మిగతా 4వ పేజీలో

కనకమ్మకు నీరాజనం



మార్గశిర మొదటి గురువారం సందర్భంగా కనకమహాలక్ష్మికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. బుధవారం అర్ధరాత్రి నుంచి క్యూలైన్లలో బారులుతీరారు. పసుపు, కుంకుమలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. - వివరాలు 6లో

అడ్డగోలుగా రాక్రీట్ వ్యవహారం

పేదల ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు

మెటీరియల్ పక్కదారి

- వైసీపీ ప్రభుత్వంలో అధికారులను లెక్కచేయని వైనం
- కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పనులు నిలిపివేత
- అసంపూర్తిగా నిర్మాణాలు
- పూర్తిస్థాయి విచారణకు హౌసింగ్ సిద్ధం



నడుపూరులో పునాదుల్లోనే నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణం

విశాఖపట్నం/ఉక్కుటౌన్‌షిప్/సబ్బవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): **గత ప్రభుత్వ హయాంలో పేదల ఇళ్ల నిర్మాణ బాధ్యతలు తీసుకున్న 'రాక్రీట్' కంపెనీ మొదటి నుంచి అడ్డగోలుగా వ్యవహరించింది. పాలకుల దన్ను ఉండడంతో అధికారులను అసలు పట్టించుకునేది కాదు. నిర్మాణంలో నాణ్యతను గాలికొదిలేసిన ఈ సంస్థ, తనకు కేటాయించిన నాలుగు లేఅవుట్‌లలో ఒక్క ఇల్లు మాత్రమే పూర్తిచేసింది. అది కూడా మోడల్ ఇల్లు. 2022 మే నెలలో అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి శంకుస్థాపనకు వస్తున్నారని సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారంలో దానిని నిర్మించింది.**

రాక్రీట్ సంస్థ రూ.80 కోట్ల అవినీతికి పాల్పడినట్టు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించిన నేపథ్యంలో జిల్లాలో ఆ సంస్థ చేపట్టిన పనులపై విచారణ జరపాలని హౌసింగ్ అధికారులు సన్నద్ధమవుతున్నారు. నగరంలో పేదల కోసం పైడివాడ అగ్రహారం, గంగవరం, నంగినారపాడు, ... మిగతా 4వ పేజీలో

రూ.1.12 కోట్ల చోరీ సొత్తు స్వాధీనం

- 58 కేసుల్లో 77 మంది అరెస్టు: సీపీ



రికవరీ చేసిన బంగారాన్ని బాధితులకు అందజేస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చి

విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత నెల జరిగిన చోరీ కేసుల్లో 77 మంది నిందితులను అరెస్టు చేసి రూ.1.12 కోట్లు విలువైన సొత్తును రికవరీ చేశారు. ఆ సొత్తును కమిషనరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన క్రైమ్ మేళాలో బాధితులకు సీపీ శంఖబ్రతబాగ్చి అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఈ ఏడాది అక్టోబరు నెలలో నగర పరిధిలో 83 చోరీ కేసులు నమోదయ్యాయన్నారు. ఆయా కేసులకు సంబంధించిన ఫిర్యాదులు అందగానే డీసీపీ ఆధ్వర్యంలో నేరపరిశోధన విభాగం అధికారులు,సిబ్బంది సంయుక్తంగా దర్యాప్తు ప్రారంభించారన్నారు. ఆయా కేసుల్లో అన్నికోణాల్లోనూ ఆధారాలు సేకరించి 58 కేసుల్లో చోరీలకు పాల్పడిన 77 మంది నిందితులను గుర్తించి అరెస్టు చేశామన్నారు. నిందితుల నుంచి ... మిగతా 4వ పేజీలో

ఉక్కు పరిరక్షణకు చిత్తశుద్ధితో ఉన్నాం

- కేంద్ర పరిశ్రమలు, ఉక్కుశాఖ సహాయ మంత్రి
- భూపతిరాజు శ్రీనివాస వర్మ

రాజమహేంద్రవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంటు పరిరక్షణపై కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ స్పష్టంచేశారు. అయినా పదేపదే తమ చిత్తశుద్ధిని ప్రశ్నిస్తూ, విమర్శిస్తూ ఉంటే అలాంటి వారి చిత్తశుద్ధిని తాము అనుమానించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. గురువారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఒక హోటల్‌లో బీజేపీ గోదావరి జోన్ మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల ప్రశిక్షణ తరగతుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ ... మిగతా 4వ పేజీలో

గుర్రంపాలెంలో మళ్లీ గ్రావెల్ అక్రమ తవ్వకాలు

- పట్టించుకోని గనులు, రెవెన్యూ శాఖలు



గుర్రంపాలెం ఏపీఐఐసీ లేఅవుట్‌కు ఆనుకుని కొండ నుంచి గ్రావెల్ తవ్వుతున్న దృశ్యం

విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి మండలం గుర్రంపాలెం ఏపీఐఐసీ లేఅవుట్ సమీపంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు మళ్లీ మొదలయ్యాయి. కూటమి పార్టీకి చెందిన నేత ప్రోద్బలంతో ఈ తవ్వకాలు సాగుతున్నట్టు గ్రామానికి చెందిన కొందరు చెబుతున్నారు. ఒకరిద్దరు ప్రశ్నిస్తే ఏపీఐఐసీ నుంచి అనుమతి తీసుకున్నామని దబాయిస్తున్నారంటున్నారు. గుర్రంపాలెం పారిశ్రామిక లేఅవుట్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన కొందరు గతంలో అదే ప్రాంతంలో ఒక కొండ నుంచి అనుమతి లేకుండా గ్రావెల్ తవ్వి తమ స్థలాలకు తరలించుకున్నారు. లక్షల క్యూబిక్ మీటర్లు గ్రావెల్, మట్టి తరలింపుపై 'ఆంధ్రజ్యోతి'లో పలు కథనాలు రావడంతో గనులశాఖ విజిలెన్స్ అధికారులు దాడులు చేసి తవ్వకందారులకు నోటీసులు జారీచేశారు. ఆ తరువాత గనుల శాఖ రెగ్యులర్ విభాగం అధికారులు షోకాజ్ జారీచేసి జరిమానా విధిస్తామని చెప్పారు. నోటీస్‌లకు ఏపీఐఐసీ ఇచ్చిన వివరణ పట్ల గనుల శాఖ సంతృప్తి చెందలేదు. ఈ నేపథ్యంలో కొందరికి జరిమానా విధిస్తూ నోటీసులు ... మిగతా 4వ పేజీలో


స్వామివారికి గరుడ సేవ చేస్తున్న అర్చకులు

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన, గరుడ సేవ

సింహాచలం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా గురువారం స్వర్ణ పుష్పార్చన, గరుడ సేవ వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులను శోభాయమానంగా అలంకరించి వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలను తీసి భక్తులతో స్పృశింపజేశారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు స్వర్ణ సంపెంగలతో పూజ చేశారు. తరువాత పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. అనంతరం రజిత గరుడ వాహనంపై ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉంచి పూజలు చేశారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

తిరుమలేశ్ సేవలు చిరస్మరణీయం


తిరుమలేశ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

మధురవాడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నగరాల కార్పొరేషన్ చైర్మన్ మరుపిళ్ల తిరుమలేశ్ నగరాల సామాజిక వర్గానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఆ కార్పొరేషన్ డైరెక్టర్ నాగోతి సూర్యప్రకాశరావు అన్నారు. ఈనెల 17న తిరుమలేశ్ విజయవాడలో మృతి చెందారు. ఈమేరకు సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో మధురవాడలో గురువారం సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నగరాల సామాజికవర్గం అభివృద్ధికి తిరుమలేశ్ చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్పొరేషన్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజులకే మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. అనంతరం నాయకులు తిరుమలేశ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో పిళ్లా నరసింగరావు, నాగోతి శివాజీ, మరుపిళ్ల పైడిరాజు, వాండ్రాసి అప్పలరాజు,పోతిన పైడిరాజు, నాగోతి అనిత, తదితరులు పాల్గొన్నారు.

చిప్పాడలో 370 మందికి వైద్య పరీక్షలు

భీమునిపట్నం (రూరల్), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిప్పాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తాళ్లవలస పీహెచ్‌సీ వైద్యాధికారిణి శోభారాణి చిప్పాడతో పాటు సిటీనగర్, కొసనవానిపాలెం, పాత మూలకుద్దు, కంచేరుపాలెం గ్రామాలకు చెందిన 370 మంది విద్యార్థులకు పరీక్షలు చేసి, మందులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దివీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో దివీస్ సామాజిక సేవా విభాగం అధికారులు డి. సురేశ్‌కుమార్, కె. నరసింహ, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సాయం

భీమునిపట్నం (రూరల్), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాటితూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న సామేయవలస గ్రామానికి చెందిన గుసిడి పవన్, వెన్నెలకు ఆ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బుడుమూరి సోమేశ్వరరావు, గ్రామానికి చెందిన ఉమామహేశ్వరరావు గురువారం రూ. 10 వేల ఆర్థిక సహాయం అందించారు. ఇద్దరు విద్యార్థులు నిరుపేదలు కావడంతో ఇళ్లకు విద్యుత్ సౌకర్యం లేదని, తెలిసి మీటరు వేయించుకోవడానికి ఈ సహాయాన్ని అందించామని దాతలు తెలిపారు. ఆ పాఠశాల బయోలజీ ఉపాధ్యాయుడు రాజేశ్వరరావు కూడా విద్యార్థులకు రూ. 2 వేల అందించారు. అలాగే పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు నల్లి రుషిత, మద్దిల భారతి, బొట్టు కార్తీక్ ఇటీవల జరిగిన పార్మెటివ్ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందడంతో వారికి గ్రామానికి చెందిన పంచాయతీ వార్డు సభ్యులు గురునాయుడు, నల్లి సూరిబాబు నగదు పురస్కారాలు అందించారు.

రామాయణం పుస్తకాలు పంపిణీ

భీమునిపట్నం (రూరల్), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాటితూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు విశ్వహిందూ పరిషత్ సభ్యులు గురువారం రామాయణం పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ సభ్యులు జి. వెంకటనారాయణ, కేఎస్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థుల్లో నైతిక ప్రవర్తన పెంపొందించడానికి పుస్తకాలు అందించామన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సింహాచలం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం తొలిపావంచా, ధారపాలెంలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్-3 కార్యనిర్వాహక ఇంజినీరు బి. సింహాచలంనాయుడు తెలిపారు. కుమ్మరి వీధి, పాతఅడివివరం కూడలి, ధారపాలెం ప్రాంతాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పద్మనాభం రూరల్ : బోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని శిర్లపాలెం ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ జగన్మోహన్‌రావు తెలిపారు. అనంతవరం, పెంట, గొల్లలపాలెం, గంధవరం, కొత్త కొవ్వాడ, పాత కొవ్వాడ, తిమ్మపురం గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

సంకల్ప్‌తో సంసిద్ధం

... 3వ పేజీ తరువాయి

అర్థమయ్యేవిధంగా బోధించి, సాధన చేయించాలి.

పక్కాగా అమలుచేస్తాం

ఇంటర్మీడియట్ బోర్డు ప్రవేశపెట్టిన సంకల్ప్-2026ను జిల్లాలోని అన్ని కళాశాలల్లో పక్కగా అమలుచేస్తాం. బోర్డు విడుదల చేసిన షెడ్యూల్‌ను జూనియర్ కళాశాలలకు పంపించి, ప్రిన్సిపాల్స్‌తో సమావేశం నిర్వహించాం. వెనుకబడిన విద్యార్థులకు లాంగ్, షార్ట్ ప్రశ్నలు నేర్పించి పరీక్షలకు సిద్ధం చేస్తాం. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో ఫలితాల సాధనకు కృషి చేస్తున్నాం.

- పి.ఉమారాణి, జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి

ఉక్కు పరిరక్షణకు చిత్తశుద్ధితో ఉన్నాం

... 3వ పేజీ తరువాయి

విశాఖ ఉక్కు కర్మాగారం కోసం రూ.11,500 కోట్ల ప్యాకేజీ మంజూరు చేయడమే తమ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. విశాఖ ఉక్కు సెంటిమెంట్‌ను సీఎం చంద్రబాబునాయుడు..కేంద్ర మంత్రి అమిత్ షా, ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌లకు చెప్పడం ద్వారా ప్యాకేజీ సాధించామని ఆయన పేర్కొన్నారు.

బయో మైనింగ్ త్వరగా పూర్తి చేయండి

స్వచ్ఛభారత్ మిషన్ జాయింట్ సెక్రటరీ రూపా మిశ్రా


యార్డు నిర్వహణపై జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌తో చర్చిస్తున్న స్వచ్ఛభారత్ మిషన్ జాయింట్ సెక్రటరీ రూపా మిశ్ర

కొమ్మాది, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కాపులుప్పాడ డంపింగ్ యార్డులోని బయో మైనింగ్‌ను ఫిబ్రవరి నెలాఖరులోగా పూర్తి చేయాలని కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ, స్వచ్ఛభారత్ మిషన్ జాయింట్ సెక్రటరీ రూపా మిశ్ర ఆదేశించారు. గురువారం ఆమె జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌తో కలిసి డంపింగ్ యార్డును సందర్శించారు. యార్డులోని బయో గ్యాస్, మైనింగ్ ప్లాంట్ల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బయో గ్యాస్ ప్లాంటు ఎప్పుడు ప్రారంభమైంది ? రోజుకు ఎన్ని టన్నుల గ్యాస్ ఉత్పత్తి అవుతుంది ?. గ్యాస్ రేటు ఎంత? బయో గ్యాస్‌కు అవసరమైన వ్యర్థాలు ఎలా సేకరిస్తున్నారు వంటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బయో గ్యాస్ నిర్వాహకుడు రాజు మాట్లాడుతూ రోజుకు 30 టన్నుల వెజిటబుల్, ఫుడ్ వేస్టు ప్లాంటుకు వస్తుందని, వాటి ద్వారా సుమారు వెయ్యి కిలోల బయో సీఎన్‌జీ ఉత్పత్తి అవుతుందన్నారు. దాని ద్వారా 30 వేల లీటర్ల లిక్విడ్ ఫెర్మెంటెడ్ ఆర్గానిక్ మెన్యూర్ ఉత్పత్తి అవుతుందని, దాన్ని రైతులకు, జీవీఎంసీ అభివృద్ధి చేస్తున్న గార్డెన్‌లకు సరఫరా చేస్తున్నామని వివరించారు. అనంతరం ఆమె బయో మైనింగ్ ప్లాంట్‌ను సందర్శించి మైనింగ్ ఇప్పటివరకు ఎన్ని లక్షల టన్నుల చేశారని అడిగి తెలుసుకున్నారు. బయో మైనింగ్ ఫిబ్రవరి నెలాఖరులోగా పూర్తయ్యేలా చూడాలని కమిషనర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేశ్ కుమార్, ఎస్ఈ గోవిందరావు, ఏఎంహెచ్ఓ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

మేలు జాతి పశువుల పెంపకంపై దృష్టిసారించాలి

జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గాడు వెంకటప్పుడు


కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గాడు వెంకటప్పుడు

పద్మనాభం రూరల్, నవబంరు 27 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతులు మేలు జాతి పశువుల పెంపకంపై దృష్టిసారించాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గాడు వెంకటప్పుడు సూచించారు. బాపిరాజు, తాళ్లవలస గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఏర్పాటు చేసిన ఉచిత పశు గర్భకోశ చికిత్స శిబిరాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడి రైతులకు ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చే విధంగా గోపాలమిత్రలు అవగాహన కల్పించాలన్నారు. రైతులు ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని పశువుల ఆరోగ్య పరిరక్షణ, పోషణపై దృష్టిసారించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డి. శంకరరావు, వ్యవసాయశాఖ జేడీ అప్పలస్వామి, ఏడీలు సునీల్, మదీనా, ప్రసాద్, పశువైద్యాధికారులు కె. మహేశ్, సౌజన్య, అనూష, భీమిలి ఏఎంసీ వైస్ చైర్మన్ పిన్నింటి జగన్నాథం, సిగనబంద సర్పంచ్ వెంకటనారాయణ, వెంకట్రావు, పాల్గొన్నారు.

చెట్టు కొమ్మ విరిగి పడి దంపతులకు గాయాలు

సాగర్‌నగర్,నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనంపై వెళుతున్న దంపతులపై చెట్టు కొమ్మ విరిగి పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన గురువారం ఉదయం సాగర్‌నగర్ ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. నగరానికి చెందిన ప్రసాద్, తన భార్యతో కలిసి ద్విచక్ర వాహనంపై సాగర్ నగర్ కాలనీకి వస్తుండగా మార్గమధ్యలో ఆకస్మాత్తుగా చెట్టు కొమ్మ విరిగి పడింది. దీంతో ప్రసాద్ ముఖభాగంలో తీవ్ర గాయాలు కాగా అతని భార్యకు స్వల్ప గాయాలయ్యాయి.

మినీ వ్యాన్ ఢీకొని వృద్ధుడికి గాయాలు

ఎండాడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎండాడ జాతీయ రహదారిపై గురువారం ఉదయం మినీ వ్యాన్ ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడికి గాయాలయ్యాయి, ఎండాడ కూడలి దాటిన వెంటనే దుర్గాలమ్మ ఆలయం ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై మధురవాడ నుంచి నగరం వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న వృద్ధుడ్ని వెనుక నుంచి వచ్చిన మినీ వ్యాన్ ఢీకొంది. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. ఆరిలోవ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

2న కార్మిక సంఘాలతో అధికారులు సమావేశం

తగరపువలస, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్‌మిల్లు కార్మికుల బకాయిల సమస్య పరిష్కారానికి వచ్చే నెల 2న విశాఖ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సమావేశం ఏర్పాటు చేశారు. కార్మిక శాఖ కార్యదర్శి గంధం చంద్రుడు సూచన మేరకు ఈ సమావేశం నిర్వహిస్తున్నారు. ఈమేరకు ఐఎన్‌టీయూసీ, టీఎన్‌టీయూసీ, కాంగ్రెస్ కార్మిక సంఘం, ఏఐటీయూసీ సంఘాలకు గురువారం అధికారుల నుంచి సమాచారం అందింది. సమావేశానికి అమరావతి నుంచి లేబర్ కమిషనర్ వస్తున్నారని మిల్లు యాజమాన్యం నుంచి కూడా ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు.

కార్మికుల పీఎఫ్ వివరాలు పరిశీలన

తగరపువలస, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్‌మిల్లు పరిధిలోని కార్మికులకు రావాల్సిన పీఎఫ్ వివరాలను పీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ అవినాశ్ గురువారం సేకరించారు. గతంలో మిల్లులో ఏర్పాటు చేసిన పీఎఫ్ కమిటీ సభ్యులతో పాటు కార్మిక సంఘాల నాయకులను కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఎంతమందికి నగదు జమ చేశారు ? ఇంకా ఎంతమందికి చేయాల్సి ఉందన్న విషయాలను అడిగారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ నాయకులు కమిషనర్‌ను కలిసి 440 మందికి చెల్లింపులు చేయాల్సి ఉందని, చెల్లింపులతో పాటు దాచుకున్న మొత్తానికి వడ్డీ కూడా ఇవ్వాలని కోరారు. అనంతరం అవినాశ్ విలేకరులతో మాట్లాడుతూ మిల్లు యాజమాన్యం నుంచి తమ సంస్థకు ఎంతమేర పీఎఫ్ మొత్తం జమ అయ్యిందని తెలుసుకుని రావాల్సిన బకాయిల గురించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీలకు భీమిలి విద్యార్థి

భీమునిపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ది సన్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న పి. గణేశ్ రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల భీమిలి ఫుట్ బాల్ గ్రౌండ్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయి అండర్ 14 విభాగంలో బాల బాలికలకు బేస్ బాల్ పోటీలు జరిగాయి. వీటిలో గణేశ్ ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈమేరకు విద్యార్థి ఈనెల 29 నుంచి డిసెంబరు 1వ తేదీ వరకూ చిత్తూరు జిల్లా పలమనేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్టు స్కూల్ డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

తర్లువాడలో 'రైతన్న మీకోసం'


రైతులకు కరపత్రాలు అందిస్తున్న అధికారులు

ఆనందపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తర్లువాడ గ్రామంలో గురువారం రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అల్లంశెట్టి మోహన్‌రావు మాట్లాడుతూ పంటల సాగులో ప్రభుత్వ సూచనల మేరకు యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ముఖ్యంగా నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్ వినియోగం, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి విషయాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. అనంతరం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు తాతరాజు అప్పారావు, రైతులు బాలి అయ్యప్ప, మజ్జి సన్యాసినాయుడు, హార్టికల్చర్ అధికారి దేవి పాల్గొన్నారు.

నిత్యాన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం



సింహాచలం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నప్రసాద పథకానికి విజయవాడకు చెందిన పీతల రామకృష్ణ, నూకరత్నం దంపతులు రూ. లక్ష విరాళంగా సమర్పించారు.విరాళం మొత్తాన్ని నగదు రూపంలో ప్రజా సంబంధాల అధికారి సూర్యనారాయణకు గురువారం ఆయన అందజేశారు. దాతను అధికారులు శేషవస్త్రంతో సత్కరించారు.

యూజీడీ పనులకు భూమి పూజ

కొమ్మాది, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) :రాజీవ్ గృహకల్ప కాలనీలో రూ. 3 కోట్ల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న యూజీడీ పనులకు ఐదో వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న యూజీడీ సమస్యపై కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించడంతో నిధులు మంజూరయ్యాయని తెలిపారు. మొత్తం రూ. 6 కోట్ల మంజూరు కాగా తొలి విడత వైఎస్సార్ కాలనీలో రూ. 3 కోట్లతో పనులు ప్రారంభించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు, ఈగల రవికుమార్, కొండపు రాజు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాలమ్మ ఆలయంలో పూజలు

తగరపువలస, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక దుర్గాలమ్మ దేవాలయంలో కార్తీక మాసం ముగింపు సందర్భంగా భవానీలు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

కాలువ నిర్మాణానికి నిధులు మంజూరు

భీమునిపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సుభాశ్ రోడ్‌లో దాసాంజనేయస్వామి ఆలయం వద్ద కాలువ పునర్నిర్మాణానికి జీవీఎంసీ రూ. 14 లక్షల నిధులు మంజూరు చేసింది.ఈమేరకు భీమిలి జోనల్ పబ్లిక్ వర్క్స్ డిప్యూటీ ఇంజినీరు సురేశ్ ఆధ్వర్యంలో గురువారం నుంచి పనులు ప్రారంభమయ్యాయి. ఆలయం వద్ద ఉన్న రాతి కాలువ పూడికపోవడంతో ఆ కాలువను తొలగించి, సీసీ కాలువ నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఈమేరకు నిధులు మంజూరయ్యాయి.

అలరించిన శాస్త్రీయ నృత్యాలు

సింహాచలం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై కళాకారుల శాస్త్రీయ నృత్యాలు భక్తులను అలరించాయి. గురువారం ఉదయం నర్సీపట్నం ప్రాంతానికి చెందిన ధన మాస్టారు పర్యవేక్షణలో గజముఖ నృత్య అకాడమీకి చెందిన కళాకారులు అన్నమయ్య, వేంకటేశ్వరస్వామి కీర్తనలకు నృత్యాలు చేశారు.

బిజినెస్ ఇన్నోవేషన్స్‌పై అంతర్జాతీయ సదస్సు


సదస్సులో పాల్గొన్న దేశ, విదేశీ ప్రొఫెసర్లు

సాగర్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో సుస్థిర సమాజ అభివృద్ధికి సరికొత్త వాణిజ్య నమూనాలు అన్న అంశంపై రెండు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ సదస్సు గురువారం నుంచి ప్రారంభమైంది. ప్రపంచంలోని పలు దేశాల నుంచి 150 మందికి పైగా పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు, ప్రణాళికా నిపుణులు, వాణిజ్య నిపుణులు సదస్సుకు హాజరయ్యారు. సదస్సును అమెరికాలోని పెన్‌స్టేట్ విశ్వవిద్యాలయం బిజినెస్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ అనగప్ప గుణశేఖరన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యర్థాల నుంచి రీ సైక్లింగ్ పద్ధతిలో సంపదను సృష్టించే విధంగా సర్క్యులర్ ఎకానమి ప్రపంచ దేశాలకు అవసరమన్నారు.నూతన వ్యాపారాలు పర్యావరణానికి మేలు చేసేవిగా ఉన్నప్పుడే దీర్ఘకాలం మనుగడ సాగించగలవని చెప్పారు. హాంగ్‌కాంగ్ యూనివర్సిటీ డిజిటల్ ఇన్నోవేషన్ నిపుణుడు డాక్టర్ కె. ప్రసన్న మాట్లాడుతూ కృత్రిమ మేధ డేటా ఆధారంగా మాత్రమే పని చేస్తుందని, కృత్రిమ మేధ ప్రయోజనాలు పొందాలంటే వివిధ రంగాల్లో నిత్యం సమాచారం సేకరించి, వాడుకోగలిగిన వ్యవస్థ ఉండాలన్నారు. విశాఖలో ఏర్పాటు కానున్న గూగుల్ డేటా సెంటర్ ద్వారా ఉద్యోగాలను సృష్టించడం సమాజానికి ఉపయోగపడే కృత్రిమ మేధ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడం అవసరమని తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్, నిర్వాహక కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ రాజాపి. పప్పు మాట్లాడుతూ ఆర్థిక రంగంలో వస్తున్న మార్పులు, వాటి ప్రభావంతో రూపుదిద్దుకుంటున్న వాణిజ్య నమూనాలపై ప్రముఖుల ప్రసంగాలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సదస్సు సహ చైర్మన్ ప్రొఫెసర్ ఎన్. సాయిసుధాకర్, అమెరికా, చైనా, యూకే, కెనడా దేశాలకు చెందిన విద్యారంగ నిపుణులు పాల్గొన్నారు.



జిల్లా బాస్కెట్ బాల్ జట్టుకు షీల్డ్ అందజేస్తున్న నిర్వాహకులు

బాస్కెట్ బాల్ పోటీల్లో విశాఖకు కాంస్య పతకం

భీమునిపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో విశాఖ జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా నూజివీడులో రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు మంగళవారం జరిగాయి. పోటీల్లో విశాఖ జిల్లా బాలికల జట్టు, కృష్ణా జిల్లా జట్టుపై 23- 10 పాయింట్ల తేడాతో గెలుపొందింది. విశాఖ జట్టుకు తృతీయ స్థానం లభించడంతో నిర్వాహకులు కాంస్య పతకం అందజేశారు.

అడ్డగోలుగా రాక్రీట్ వ్యవహారం

... 3వ పేజీ తరువాయి

నడుపూరుల్లో సుమారు 12 వేల ఇళ్ల నిర్మాణ బాధ్యతను వైసీపీ ప్రభుత్వం రాక్రీట్‌కు అప్పగించింది. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.8 లక్షలు ప్రభుత్వం మంజూరుచేసింది. అయితే సిమెంట్, ఇనుము, ఇసుక ప్రభుత్వమే సరఫరా చేసింది. మొత్తం యూనిట్ ఖరీదు రూ.1.8 లక్షల్లో మెటీరియల్ కాస్ట్ మినహా మిగిలిన మొత్తం నిర్మాణ సంస్థకు ఇవ్వాలని నిర్ణయించింది. కానీ, రాక్రీట్ సంస్థ నాలుగు లేఅవుట్‌లలో మొదటి నుంచి అనుకున్న విధంగా పనులు చేయలేకపోయింది. కేటాయించిన మెటీరియల్ వినియోగంపై పక్కాగా రికార్డులు నిర్వహించలేదు. కొన్నిచోట్ల మెటీరియల్‌ను సంస్థ ఉద్యోగులు కొందరు విక్రయించుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. పైడివాడ అగ్రహారం, గంగవరంలో స్థానికంగా ఉండే కొందరు చోటా నేతలు ఇనుము, ఇసుక పట్టుకుపోయారు. నిర్మాణాల్లో కూడా నాణ్యత ఉండేది కాదు. ఈ విషయమై అప్పట్లో కొందరు అధికారులు ప్రశ్నిస్తే కంపెనీ ప్రతినిధులు ఎదురుతిరిగేవారు. మరికొందరు అధికారులు ఆ కంపెనీతో కుమ్మక్కైపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 'రాక్రీట్' సంస్థ పూర్తిగా పనులు నిలిపివేసి, జిల్లా నుంచి బిచాణా ఎత్తేసింది. ఈ నేపథ్యంలో బిల్లులు మంజూరును అధికారులు నిలిపివేయడంతో కంపెనీ కోర్టును ఆశ్రయించింది. దీంతో సుమారు ఏడాదికిపైగా రాక్రీట్‌కు ఇచ్చిన నాలుగు లేఅవుట్‌లలో ఇళ్లు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అధికారుల వద్ద ఉన్న వివరాల మేరకు పైడివాడ అగ్రహారం, నడుపూరుల్లో 8,044 ఇళ్లకుగాను ఒక ఇల్లు పూర్తిచేయగా...రూఫ్ స్థాయిలో 137 ఉన్నాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. గత ఏడాది వరకూ నిర్మించిన ఇళ్లకు రూ.26.76 కోట్లు బిల్లులు మంజూరుచేయగా, రూ.6.02 కోట్లు విలువైన 2,17,348 సిమెంట్, రూ.12.03 కోట్ల విలువైన 2005 టన్నుల ఇనుము సరఫరా చేశారు. తాజాగా రాక్రీట్ అవినీతి గురించి మంత్రి వెల్లడించడంతో జిల్లాలో ఆ సంస్థ చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు, లేఅవుట్‌లలో మిగిలిన మెటీరియల్, ఇతర అంశాలపై విచారణ చేయాలని హౌసింగ్ అధికారులు నిర్ణయించారు. కాగా ఆయా లేఅవుట్‌లలో ఇతర కంపెనీలకు కేటాయించిన ఇళ్ల నిర్మాణాలు మాత్రం కొనసాగుతున్నాయి.

పీపీపీపై పెదవివిరుపు

... 3వ పేజీ తరువాయి

మొత్తానికి వడ్డీ లెక్కించుకుని టెండర్ ఎక్కువకు వేస్తారని చెప్పారు. అలాగే ఆ రోడ్డులో హోర్డింగ్‌లు పెట్టుకుని ప్రకటనల రూపంలో ఆదాయం సంపాదించుకుంటారని, ఈ తరహా విధానం ఇండోర్, తిరువనంతపురం వంటి చోట్ల అమలులో ఉందని వివరించారు. దీంతో కార్పొరేటర్లు సంతృప్తి చెంది మౌనం వహించారు. ఇదిలావుండగా జీవీఎంసీలో పనిచేస్తున్న కొందరు అధికారులు మాత్రం పీపీపీ యాన్యుటీ మోడల్‌ను అమలు చేసే తీరును తప్పుపడుతున్నారు. ఇండోర్‌లో మూడేళ్ల కిందట అధ్యయనం కోసం వెళితే అక్కడ రోడ్లను కాంట్రాక్టర్లు కేవలం ప్రకటనల ఆదాయంతోనే నిర్మాణం చేపట్టి, నిర్వహిస్తున్నారని గుర్తించామని, అదే విధానం జీవీఎంసీలో కూడా అమలు చేయాలని భావించినా, పలు కారణాలతో కార్యరూపం దాల్చలేదని చెబుతున్నారు. ఇప్పుడు జీవీఎంసీలో 88.3 కిలోమీటర్లు పొడవు కలిగిన 54 రోడ్ల నిర్మాణం, నిర్వహణ నిమిత్తం కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించడంతోపాటు ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయాన్ని కూడా పొందేలా నిబంధనలు రూపొందించడం సరికాదని అభిప్రాయపడుతున్నారు. దీనివల్ల కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూరుతుందని, ప్రకటన రూపంలో వచ్చే ఆదాయం జీవీఎంసీ కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని చెబుతున్నారు. ఈ విషయంలో కమిషనర్ పునఃపరిశీలించి జీవీఎంసీకి ఆర్థిక నష్టం కలగకుండా చూడాలని కోరుతున్నారు.

ఛ్చ...టీడీఆర్‌లా!

... 3వ పేజీ తరువాయి

రిజిస్ట్రేషన్ల శాఖ చెబుతోంది. దీంతో పనులు ముందుకు సాగడదం లేదు.

మునిసిపల్ పన్నులకు ఉపయోగించుకునేలా చేస్తే మేలు

ఓ.నరేశ్‌కుమార్, వైజాగ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్

ఇప్పుడు టీడీఆర్‌లు భవన నిర్మాణాలకే ఉపయోగించుకోవాలని ఇస్తున్నారు. వీటిని జారీ చేసేది పురపాలక శాఖే కాబట్టి...ప్రజలు కట్టాల్సిన మునిసిపల్ పన్నులకు కూడా వీటిని ఉపయోగించుకునేలా అవకాశం ఇస్తే బాగుంటుంది. అప్పుడు టీడీఆర్‌లు అందరికీ ఉపయోగపడతాయి. వాటిని కొనడానికి అంతా ముందుకు వస్తారు. దీనివల్ల 90 శాతం వరకు రేటు లభించే అవకాశం ఉంది. ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంటే భూ సేకరణ కూడా సులువు అవుతుంది. ఇదే విషయాన్ని ఎంపీ శ్రీభరత్, మంత్రి లోకేశ్ లేఖలను ద్వారా కోరాము.

రూ.1.12 కోట్ల చోరీ సొత్తు స్వాధీనం

... 3వ పేజీ తరువాయి

838.331 గ్రాముల బంగారం, రూ.3,10,500 నగదు, 22 మోటార్ సైకిళ్లు, కారు, సోనీ కెమెరాతోపాటు 505 సెల్‌ఫోన్‌లను రికవరీ చేశామన్నారు. వీటి విలువ రూ.1,12,03,480 ఉంటుందన్నారు. నగరంలో నేరాల నియంత్రణకు గత నెలలో 309 సీసీ కెమెరాలను ఏర్పాటుచేయడంతోపాటు 218 అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. చోరీల నియంత్రణతోపాటు అనుమానితులను గుర్తించి అదుపులోకి తీసుకునేందుకు వీలుగా రాత్రి, పగలు ప్రత్యేక గస్తీ బృందాలు, డ్రోన్ కెమెరాలతో నిర్మానుష్యప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. బాధితులకు రికవరీ చేసిన సొత్తుని అందజేసి, వారి అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో డీసీపీ లతామాధురి, ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, సీఐ కె.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

కొండపై బదిలీల్లో స్వల్పమార్పులు

... 3వ పేజీ తరువాయి

వెళ్లి వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవద్దని అధికారులను హెచ్చరించారు. మరోవైపు నిత్యం ఘర్షణలు పడే ఉద్యోగికి వీవీఐపీలు వచ్చే కొండపై ఎలా విధులు కేటాయిస్తారంటూ కమిషనర్ కార్యాలయం ఆలయ అధికారులను ప్రశ్నించినట్టు తెలిసింది. అంతర్గత బదిలీలు చేసే ముందు ఎవరిని ఎక్కడ వేస్తున్నారో పరిశీలన చేసుకోవాలని హెచ్చరించారు. విజయనగరం విద్యార్థుల హాస్టల్‌లో పనిచేస్తున్న వ్యక్తిని వెంటనే కొండపై పారిశుధ్యం పర్యవేక్షణ విధుల నుంచి తప్పించి వెనక్కి పంపాలని ఆదేశించారు. అయితే విజయనగరంలో హాస్టల్ విద్యార్థులు కూడా సదరు ఉద్యోగి తమను వేధిస్తున్నాడని ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదులు పంపడంతో, విజయనగరం పంపకుండా కొండ దిగువన విధులు కేటాయించారు.

గుర్రంపాలెంలో మళ్లీ గ్రావెల్ అక్రమ తవ్వకాలు

... 3వ పేజీ తరువాయి

ఇచ్చింది. ఈ సమస్య ఇంకా కొలిక్కి రాకపోవడంతో రెవెన్యూ రికవరీ యాక్టు అమలు చేయాలని గనుల శాఖ యోచిస్తోంది. ఇదిలావుండగా పారిశ్రామిక లేఅవుట్‌లో ప్లాటు కొనుగోలు చేసిన ఒకరు...కూటమి నేత సాయంతో సమీపంలో కొండపై ఐదారు రోజుల నుంచి పొక్లెయిన్‌తో గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారు. ఈ విషయాన్ని గ్రామస్థులు కొందరు పెందుర్తి రెవెన్యూ అధికారులు, గనుల శాఖకు ఫోన్ చేసి చెప్పారు. గత ఏడాది లేఅవుట్‌కు ఆనుకుని ఉన్న ఒక కొండను పూర్తిగా తవ్వేసిన అక్రమార్కులు, ఇప్పుడు అదే ప్రాంతంలో మరో కొండపై కన్నేశారు.

అభివృద్ధి జాడ లేని జాలారిపేట

» పారిశుధ్య నిర్వహణ శూన్యం » అధ్వానంగా వీధులు » కానరాని కాలువల ఆధునికీకరణ » చినుకు పడితే కంపుకంపు

బీచ్ రోడ్డు, నవంబరు 27, (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జాలారిపేట ప్రాంతం పారిశుధ్య నిర్వహణ లోపంతో సతమతమవుతోంది. ఇక్కడ పలు వీధుల్లో పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టకపోవడం, డ్రైనేజీలు ఆధునీకరించకపోవం వంటి సమస్యలతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.ఈ విషయమై సచివాలయాల్లో ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

జాలారిపేటలోని ప్రధాన గెడ్డలో పూడికలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. రోడ్డు మీద తాగు నీటి పైప్‌లైన్ల మరమ్మతు కోసం గోతులు తవ్వారు. పనులు పూర్తయ్యాక కొన్నిచోట్ల వాటిని పూడ్చకుండా అసంతృప్తిగా వదిలేయడంతో ప్రమాదకరంగా మారింది. గోతుల్లో పడి ఎవరు ప్రమాదంలో పడతారోనన్న ఆందోళన స్థానికుల్లో నెలకొంది ప్రధాన కాలువ వద్ద ఎక్కడికక్కడ వ్యర్థాలు పేరుకుపోయి, దోమల బెడద ఎక్కువైంది. ఈ సమస్య పరిష్కరించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. జీవీఎంసీ మలేరియా విభాగం వారు దోమల నివారణ కోసం యాంటీ లార్వా ఆపరేషన్స్ కనీసం ఫాగింగ్ కూడా చేపట్టడం లేదని అసంతప్తి వ్యక్తం చేస్తున్నారు.

అలాగే ఈ ప్రాంతంలో ప్రధాన రహదారులు అధ్వానంగా ఉన్నాయి. పలు చోట్ల గోతులు ఏర్పడడంతో రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సమయాల్లో పిల్లలు, వృద్ధులు, మహిళలు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రివేళ ఈ సమస్య మరింత ఇబ్బందిగా ఉంటోందని వాపోతున్నారు.


ప్రధాన రహదారి వద్ద ప్రమాదకర స్థితిలో కాలువ


కాలువ నుంచి తీసిన రోడ్డు పక్కనే పడేసిన చెత్తాచెదారం

వ్యర్థాల తొలగింపు చేపట్టరే..!

ప్రతి ఆదివారం కార్మికులకు సెలవు కావడంతో వాణిజ్య సముదాయాల వద్ద, రహదారులపై వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. దీంతో ఎక్కడికక్కడ తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. సోమవారం కార్మికులు విధులకు వచ్చినా సాయంత్రం వరకూ వ్యర్థాల కుప్పలను తరలించడం లేదు. దీంతో ఆయా రోజుల్లో రాకపోకలు సాగించేవారు. స్థానిక నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ ప్రజారోగ్యం విభాగ అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


జూలో నీటి ఏనుగు జన్మదిన వేడుకలు

» సీపీఈ కళాశాల ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం

ఆరిలోవ. నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలలో గల జూనియర్ దళపతి హిప్పోపాటమస్ (నీటి ఏనుగు) 8వ జన్మదిన వేడుకలను సీపీఈ కళాశాల ఆధ్వర్యంలో గురువారం ఉదయం నిర్వహించారు. విద్యార్థులు అంతా మాస్కులు ధరించి కాయగూరలతో తయారు చేసిన ప్రత్యేకమైన కేకును కోశారు. అనంతరం వాటిని యానిమల్ కీపర్‌కు అందించి నీటిలో ఉన్న జూనియర్ దళపతికి (నీటి ఏనుగు)కు తినిపించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎంతో ఆసక్తి, ఉత్సాహంతో ఆ దృశ్యాలను సెల్‌ఫోన్లలో బంధించారు.

ఈ సందర్భంగా జూ క్యూరేటర్ జి.మంగమ్మ మాట్లాడుతూ.. నీటి ఏనుగు జన్మదిన వేడుకలను విద్యార్థుల మధ్య నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని జూ క్యూరేటర్ జి.మంగమ్మ అన్నారు. పర్యావరణ ప్రక్రియలో నీటి ఏనుగుల పాత్రను గురించి అమె విద్యార్థులకు వివరించారు. హిప్పోలు (హిప్పోపోటమ్సయాంపీ బియస్) ఉప-సహారా ఆఫ్రికాకు చెందిన ఒక పెద్ద సెమీ జలాకార క్షీరదం అని తెలిపారు. ఇది భారీ పరిమాణంతో ఉంటుదన్నారు. ఈ వేడుకలను ఘనంగి నిర్వహించిన సీపీఈ కళాశాల సీఈవో ఆదినారాయణను ఆమె అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ నవ్య, విద్యార్థులు పాల్గొన్నారు. దళపతిని ఒకరోజు దత్తత తీసుకున్నారు. దాంతో పాటు బ్లాక్ స్వాన్స్ (నల్ల హంసలు), రెడ్‌నెక్డ్ వాలబీ, రింగ్ టెయిల్డ్ లెమర్‌లను (కోతుల జాతికి చెందిన) ఒక సంవత్సరం పాటు సీపీఈ కాలేజీ వారు దత్తత తీసుకున్నట్టు జూ క్యూరేటర్ తెలిపారు.


నీటి ఏనుగుకు పండ్లు తినిపిస్తున్న యానిమల్ కీపర్


విద్యార్థులు తయారు చేసిన కేక్


కేక్ కట్ చేస్తున్న విద్యార్థులు

పాఠశాలను సందర్శించిన మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్


పాఠశాలను సందర్శించిన కార్పొరేషన్ చైర్మన్ పెదరాజు

ఎంవీపీ కాలనీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 18వ వార్డులోని వాసవానిపాలెంలో ఉన్న ప్రభుత్వ మత్స్యకార పాఠశాలను మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కొల్లి పెదరాజు గురువారంసందర్శించారు. పాఠశాలలోని వసతులు, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని ఏకైక మత్స్యకార పాఠశాల ఇదొక్కటే అయినా, తగినంత మంది ఉపాధ్యాయులు లేరని పాఠశాల చైర్మన్ పేర్ల భాస్కరరావు తెలిపారు. ఈ పాఠశాలను విద్యాశాఖలో కలిపేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై తనవంతు కృషి చేస్తానని కార్పొరేషన్ చైర్మన్ హామీ ఇచ్చారు. స్థానిక నాయకులు గురుమూర్తి, ప్రధానోపాధ్యాయురాలు సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ రత్నవల్లి బదిలీ

ఆరిలోవ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణాపురంలో గల అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రత్నవల్లి బదిలీ అయ్యారు. ఆమెను తాళ్లపాలెంలోని బాలికల అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులం జూనియర్ కళాశాలకు బదిలీ చేశారు. ఆమె గురువారం ఇక్కడ విధుల నుంచి రిలీవ్ అయినట్టు తెలిసింది.

ఏసీబీ వలలో మారేడుపూడి వీఆర్వో

» రూ.20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం


సూర్యనారాయణ

అనకాపల్లి టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భూమి మ్యూటేషన్‌కు రూ.20 వేలు లంచం తీసుకుం టూ మారేడుపూడి వీఆర్వో ఎం.సూర్యనారాయణ గురువారం ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ బీవీఎస్ఎస్ రమణమూర్తి తెలిపిన వివరాలు ఇలా వున్నాయి.

అక్కిరెడ్డివానిపాలెం గ్రామానికి చెందిన సాలాపు సంజీవరావుకు 24 సర్వే నంబర్లలో కలిపి మొత్తం మూడున్నర ఎకరాల భూమి ఉంది. సంజీవరావు మే 30న మరణించారు. ఆయన పేరున ఉన్న భూమిని తన తల్లి దేముడమ్మ పేరున మార్చాలని కుమారుడు శ్రీను సెప్టెంబరులో వీఆర్వోకు దరఖాస్తు చేసుకున్నారు. 24 సర్వే నంబర్లకు సంబంధించి 19 సర్వే నంబర్లలోని భూమికి వీఆర్వో మ్యూటేషన్ చేశారు. మిగిలిన ఐదు సర్వే నంబర్లలో ఉన్న భూమిని మ్యూటేషన్ చేయడానికి రూ.50 వేలు లంచం అడిగారు. బుధవారం మధ్యాహ్నం వీఆర్వోను శ్రీను కలిసి రూ.20 వేలు ఇస్తానని చెప్పడంతో వీఆర్వో అంగీకరించారు. లంచం ఇవ్వడానికి మనసు అంగీకరించక శ్రీను బుధవారం ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచన మేరకు గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చారు. అక్కడ వీఆర్వో సూర్యనారాయణకు రూ.20 వేలు లంచం ఇవ్వగా, మాటువేసి ఉన్న ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో సీఐ, సిబ్బంది వీఆర్వోను అరెస్టు చేశారు. గతంలో కూడా ఆయనపై అభియోగాలు ఉన్నట్టు తమ దృష్టికి వచ్చిందని, వాటిపై కూడా విచారణ చేస్తామని డీఎస్పీ తెలిపారు. వీఆర్వోను శుక్రవారం ఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నామన్నారు. పెందుర్తి సమీపంలోని సుజాతనగర్‌లో గల వీఆర్వో ఇంట్లో కూడా ఏసీబీ అధికారితనిఖీలకు వెళ్లినట్టు తెలిసింది.

బార్ రహదారి ఆక్రమణ

» వాహనాల పార్కింగ్‌తో రాకపోకలకు స్థానికుల అవస్థలు

మద్దిలపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం జాతీయరహదారి త్రిబుల్‌ఎస్ బార్ డౌన్ రోడ్డు ఆక్రమణలకు గురైంది. కారు, ఆటో మెకానిక్ షెడ్‌లకు వచ్చే వాహనాల పార్కింగ్‌తో ఇరుకుగా మారింది. దీంతో కింది ప్రాంతంలో నివాసముంటున్న అపార్ట్‌మెంట్ నివాసుల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదరవుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఆటోలు, కార్లు పార్కింగ్ చేసి రిపేర్లు చేస్తున్నారు. దీనివల్ల నిత్యం ప్రయాణించే వాహనాలు ఎదురెదురుగా వెళ్లడానికి వీలు లేక ట్రాఫిక్ నిలిచిపోతోంది. దీంతో ఆ ప్రాంత అపార్ట్‌మెంట్ నివాసులు గురువారం పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. త్రిబుల్ఎస్ బార్ రోడ్డు ఆక్రమణలకు గురైందని, రిపేర్లకు వచ్చే వాహనాలు రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేయడం ప్రయాణాలకు అంతరాయం కలుగుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో కూడా పోలీసులకు ఫిర్యాదు చేస్తే రెండు మూడు రోజుల చర్యలు తీసుకున్నారు. తర్వాత పోలీసులు పట్టించుకోకపోవడంతో యథావిధిగా రిపేర్లకు వచ్చే కార్లను రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేస్తున్నారు. రోడ్డు ఆక్రమణలపై శాశ్వత చర్యలు తీసుకోవాలని కోరుతూ అపార్ట్‌మెంట్ నివాసులు కోరుతున్నారు.


మరో వాహనం వెళ్లడానికి కూడా వీలు లేకుండా రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాలు

ప్రత్యేక అవసరాల పిల్లలకు క్రీడా పోటీలు

ఆరిలోవ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తోటగరువు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో గురువారం జిల్లా స్థాయిలో క్రీడల పోటీలను సమగ్ర శిక్ష, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అంగ వైకల్యం, మానసిక వైకల్యం, దృష్టి లోపం గల విద్యార్థులకు ఈ పోటీలను విభాగాల వారీగా నిర్వహించారు. 100 మీటర్లకా, 200 మీటర్లు రిలె, షార్ట్‌పుట్, డిస్కస్ త్రో. జావెలిన్ త్రో, లాంగ్ జంప్, హైజంప్ తదితర క్రీడా అంశాల్లో పోటీలను నిర్వహించారు. పిల్లలు ఎంతో ఆసక్తి, క్రీడా స్ఫూర్తితో పాల్గొన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్, శిక్షణాధికారి డాక్టర్ జె.చంద్రశేఖర్, జిల్లా సహాయ విద్య సమన్వయకర్త ఉప్పలపాటి నీరజ, చినగదిలి మండల విద్యాశాకాధికారి రవీంద్రబాబు, తోటగరువు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దుర్గాభవానీ, ఏవీఎన్ కాలేజి ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ రామస్వామి, మెడికల్ ఎక్స్‌పర్ట్ డాక్టర్ శీతల్, ఇతర సెక్టోరియల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ప్రత్యేక ఉపాధ్యాయులు రిసోర్స్ పర్సన్స్, పీఈటీలు పాల్గొన్నారు.


విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

'పిల్లలతో సున్నితంగా మెలగాలి'

ఆరిలోవ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక అవసరాల పిల్లలను అతి సున్నితంగా చూసే బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందని సమగ్ర శిక్షణ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్, శిక్షణాధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం ఉదయం తోటగరువు ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆయన మాట్లాడుతూ పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతూ వారి ఆరోగ్యం, వికాసం గురించి ఆరా తీస్తుండాలని ఉపాధ్యాయులకు సూచించారు.


కొత్తవలసలోని ప్రగతి డిగ్రీకళాశాలలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న రెక్టార్ కింగ్

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన రెక్టార్

విశాఖపట్నం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలం దూర విద్య కేంద్రం పరిధిలో జరుగుతున్న యూజీ పీజీ పరీక్ష కేంద్రాలను రెక్టార్ ఆచార్య పి.కింగ్ గురువారం పరిశీలించారు. ఎస్.కోటలోని వివేకానంద పీజీ డిగ్రీ కళాశాల, కొత్తవలసలోని ప్రగతి డిగ్రీకళాశాలలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణను ప్రత్యక్షంగా గమనించారు. అవకతవకలకు అవకాశం లేకుండా పరీక్షలు నిర్వహించాలని యాజమాన్యాలకు సూచించారు. దూరవిద్య కేంద్రం సంచాలకుడు ఆచార్య డీఏ నాయుడుఆయన వెంట ఉన్నారు.

అనుమతులు లేకపోవడంతో దుకాణదారుడిపై కేసు నమోదు

» సౌందర్యం పెంపు పేరుతో ఔషధాలు విక్రయిస్తుండడంతో చర్యలు

సిరిపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సౌందర్యం పెంపు పేరుతో ఎటువంటి అనుమతులేకుండా ఔషధాలను విక్రయిస్తున్న దుకాణ యజమానిపై జిల్లా ఔషధ నియంత్రణ అధికారులు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి విశాఖ ఔషధ నియంత్రణ శాఖ సహాయ సంచాలకులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

నగరంలోని ఎంవీపీ కాలనీలో ఎటువంటి అనుమతులేకుండా సుహం క్లినిక్ అండ్ డయాగ్నస్టిక్ సెంటర్ నిర్వహిస్తున్నట్టు వచ్చిన ఫిర్యాదుల మేరకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వి.అభిప్రియ ఆధ్వర్యంలోని బృందం తనిఖీలు నిర్వహించారు. ఆ దుకాణంలో ఎటువంటి అనుమతులు తీసుకోకుండా ఔషధాలు విక్రయిస్తున్నట్టు గుర్తించారు. సుమారు రూ.80 వేలు విలువ గలిగిన సౌందర్య సాధన ఔషధాలు స్వాధీనం చేసుకున్నట్టు సహాయ సంచాలకుడు విజయ్‌కుమార్ తెలిపారు. ఔషధాలను సీజ్ చేసి ప్రయోగశాలకు పంపించినట్టు తెలిపారు. దుకాణదారుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ పంపినట్టు ఆయన తెలిపారు.

మృతుడి కుటుంబానికి నిత్యావసర సరుకుల అందజేత

ఆరిలోవ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 11వ వార్డులోని గాంధీనగర్‌కు చెందినపోలిపల్లి కన్నారావు ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో ఆయన కుటుంబానికి టీడీపీ నాయకుడు క్యాటరింగ్ రాజు నిత్యావసర సరుకులను గురువారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజారావు, మూది అప్పారావు, రంగాల మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- ఆంధ్రా కింగ్ తాలూకా : శరత్, మెలోడీ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య (గాజువాక), ఎస్.వి.సి. లిఖిత (శ్రీహరిపురం).
- ప్రేమంటే : సంగమ్, కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీవెంకటేశ్వర-1, ఎస్.వి.సి. గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి).
- 12ఎ రైల్వే కాలని : లీలామహల్, రామ, నటరాజ్ (పెందుర్తి). మిని మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతా రామయ్య (పరవాడ).
- కాంత :
- రాజు వెడ్స్ రాంబాయి / మఫ్టీపోలీసు : జగదాంబ
- శిసు / రాజు వెడ్స్ రాంబాయి : శారదా
- పాంచ్‌మినార్ / ఇట్లు మీ ఎదవ : రమాదేవి
- ది గర్ల్ ఫ్రండ్ : శ్రీకన్య, కిన్నెర (మద్దిలపాలెం), నటరాజ్-2 (పెందుర్తి).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 52, వంకాయలు (తెలుపు) 54, వంకాయలు (నలుపు) 70, బెండకాయలు 54, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 48, బీరకాయలు 50, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 22, క్యారెట్ 56, దొండకాయలు 34, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 90,అల్లం (పాతది) 70, బరబాటి 46, ముల్లంగి 48, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 56, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 64, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 50, కీరదోస 30, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 30, చిలగడదుంపలు 38, కంద 50, దేముడు చిక్కుడు 66, గోరుచిక్కుడు 56, కూర పెండలం 36, బ్రకోలి 45, పనసపొట్టు 180, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 70, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 20, మామిడి అల్లం 64, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	610
విజయనగరం	614
శ్రీకాకుళం	614

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	98
లైవ్ ధర	118
విత్ స్కిన్	206
స్కిన్‌లెస్	216

ఎస్‌వోఐతో ఏయూ ఒప్పందం



ఒప్పంద పత్రాలు పదర్శిస్తున్న ఏయూ, సర్వే ఆఫ్ ఇండియా ప్రతినిధులు

విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సర్వే ఆఫ్ ఇండియాతో ఏయూ అవగాహనా ఒప్పందం చేసుకుంది. పాలకమండలి సమావేశ మందిరంలో గురువారం ఒప్పంద పత్రాలపై వీసీ జీపీ రాజశేఖర్ సమక్షంలో రిజిస్ట్రార్ కె.రాంబాబు, సర్వే ఆఫ్ ఇండియా అడిషనల్ సర్వేయర్ జనరల్ జి.వరుణకుమార్ సంతకాలు చేశారు. ఐదేళ్ల కాలపరిమితిగల ఒప్పందంలో పరిశోధన, ఇంటర్న్‌షిప్, సర్వే ఆఫ్ ఇండియాకు సంబంధించిన సమాచారం ఏయూకు అందించనున్నారు. కార్యక్రమంలో ఆచార్యులు నజీర్ మహ్మద్, లలితాభాస్కరి, సర్వే ఆఫ్ ఇండియా డైరెకటర్ బీసీ పరిడా, వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

5, 6 తేదీల్లో జియో స్పేషియల్ టెక్నాలజీపై వర్క్‌షాప్


సదస్సు పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆచార్య జగదీశ్వరరావు, విద్యార్థులు

విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా జియో ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో జియో స్పేషియల్ స్మార్ట్ థింకింగ్ ఇన్ స్కూల్ ఎడ్యుకేషన్ అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహించనున్నట్టు విభాగాధిపతి ఆచార్య పి.జగదీశ్వరరావు వెల్లడించారు. డిసెంబరు 5,6 తేదీల్లో నిర్వహించే వర్క్‌షాప్‌నకు ఇస్రో సహకారం అందిస్తుందన్నారు. తొలిరోజు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి గల ఉపాధ్యాయులు వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. రెండోరోజు పాఠశాల విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన, ఆసక్తి పెంచే విధంగా ప్రత్యేక సాంకేతిక ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. అనంతరం వర్క్‌షాప్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ప్రహరీ నిర్మాణాన్ని అడ్డుకున్న ఏయూ అధికారులు

» వర్సిటీ స్థలంలో నిర్మాణం చేపడుతున్నారంటూ అభ్యంతరం


ప్రహరీ నిర్మాణానికి తీసిన గోతులను పరిశీలిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ రాంబాబు, అధికారులు

మద్దిలపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పెదవాల్తేరు పోలమాంబ అమ్మవారి ఆలయం రక్షణకు చేపట్టిన ప్రహరీ నిర్మాణ పనులను గురువారం ఏయూ అధికారులు అడ్డుకున్నారు. అమ్మవారి ఆలయం వెనుక ప్రహరీ నిర్మాణానికి ఆలయ నిర్వాహకులు గోతులు తవ్వించారు. ఈ విషయం తెలుసుకున్న ఏయూ రిజిస్ట్రార్ కె.రాంబాబు, డీన్ శ్రీనివాసరావు, ఇంజనీర్లు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

ప్రహరీ నిర్మాణం చేపట్టిన స్థలం ఏయూదని ఆలయ నిర్వాహకులకు స్పష్టం చేశారు. ఆలయం వెనుక రక్షణ కల్పించేందుకు ప్రహరి నిర్మాణం చేయడానికి డోనర్ ముందుకు వచ్చారని, గోడ కట్టుకునేందుకు ఆటంకం కలిగించవద్దని ఆలయ నిర్వాహకులు ఏయూ అధికారులను కోరారు. పోలమాంబ ఆలయం స్థలంలోనే గోడ నిర్మాణం చేస్తున్నట్టు తెలిపారు. కాగా, ప్రస్తుతానికి పనులు నిలిపివేసి ఏయూ, ఆలయం స్థలాల సరిహద్దులను సర్వే చేసి సమస్య పరిష్కరించుకోవాలని ఇరు వర్గాలు నిర్ణయించుకున్నాయి.

15వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వ హయంలోనే అభివృద్ధి పరుగులు తీస్తుందని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. తూర్పు నియోజవర్గం పదిహేడో వార్డు పరిధిలోని ఆదర్శనగర్‌లో నిర్మించనున్న సీసీ రోడ్డు, కాలువలకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు గురువారం శంకుస్థాపన చేశారు. కార్పొరేటరు గేదెల లావణ్య వినతి మేరకు జీవీఎంసి రూ. 50 లక్షలు మంజూరు చేసింది. వార్డు తెలుగుదేశం అధ్యక్షులు సత్తిబాబు, నాయకులు కాళ్ల శంకర్, జీవీఎంసి ఏఈలు అప్పలనాయుడు, శ్రీహిత తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి పోటెత్తిన భక్తులు


ఆలయం వద్ద భక్తుల రద్దీ

ఆరిలోవ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : మార్గశిర మాసం సందర్భంగా స్థానిక ఎస్మెఎల్ఎం కాలనీలో వెలిసిన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి గురువారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి క్షీరాభిషేకాలు, పసుపు కుంకాలతో పూజలు చేశారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ సాయిబాబు, కార్యదర్శి కేశవరావు, కోశాధికారి ఈశ్వరమ్మ పర్యవేక్షించారు. అమ్మవారిని 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత దర్శించుకొని క్షీరాభిషేకం, పూజలు చేశారు.


అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయం హుండీ ఆదాయం రూ.2.73 లక్షలు



హుండీ డబ్బులను లెక్కిస్తున్న శ్రీహరి సేవా పీఠం ప్రతినిధులు

సీతమ్మధార, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 24వ వార్డు నక్కవానిపాలెంలో గల ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో హుండీలను గురువారం లెక్కించారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ పర్యవేక్షణలో శ్రీహరి సేవా పీఠం ప్రతినిధులు హుండీలో డబ్బులు లెక్కించారు. 92 రోజులకు ఆలయంలో గల హుండీ ద్వారారూ.2,73,319ల ఆదాయం లభించినట్టు ఈవో తెలిపారు.

సామాజిక భవన నిర్మాణం పూర్తయ్యేదెన్నడో..?

- తారకరామ నగర్‌లో పునాదుల్లోనే పనులు
- పట్టించుకోని ఇంజనీరింగ్ అధికారులు

అక్కయ్యపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 45వ వార్డు తారకరామనగర్‌లోని పార్కులో నిర్మిస్తున్న సామాజిక భవన నిర్మాణ పనులు నత్తనడక నడుస్తున్నాయి ఈ పార్కును రూ.45 లక్షలతో నిర్మించేందుకు కొన్ని నెలల క్రితం కార్పొరేటర్ కంపా హనోక్‌తో కలిసి ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు శంకుస్థాపన చేశారు. తర్వాత పనులు మొదలు పెట్టి, అంతలోనే నిలపివేశారు. అప్పటి నుంచి నేటి వరకూ కేవలం కోలమ్స్ మాత్రమే వేశారు. మిగతా పనులను చేయకుండా చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఈ ప్రాంతంలో నిర్మించే జీ ప్లస్-1 సామాజిక భవనం పూర్తయితే సమావేశాలు, వివిధ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఎంతో ఉపయోగపడుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. కానీ సామాజిక భవనం నిర్మించకుండా రోజులు గడుపుతున్నారంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ సామాజిక భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి చేయాలని కోరుతున్నారు. కానీ అధికారులు పట్టించుకోకపోవడంతో సామాజిక భవన నిర్మాణ పనులు చాలా తాపీగా జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, కార్పొరేటర్ కంపా హనోక్ స్పందించి నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తయ్యేలా, సామాజిక భవనాన్ని అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



స్తంభాలు దశ దాటని సామాజిక భవనం నిర్మాణమిదే..

పీపీపీపై పెదవి విరుపు

... 3వ పేజీ తరువాయి

మొత్తానికి వడ్డీ లెక్కించుకుని టెండర్ ఎక్కువకు వేస్తారని చెప్పారు. అలాగే ఆ రోడ్డులో హోర్డింగ్‌లు పెట్టుకుని ప్రకటనల రూపంలో ఆదాయం సంపాదించుకుంటారని, ఈ తరహా విధానం ఇండోర్, తిరువనంతపురం వంటి చోట్ల అమలులో ఉందని వివరించారు. దీంతో కార్పొరేటర్లు సంతృప్తి చెంది మౌనం వహించారు. ఇదిలావుండగా జీవీఎంసీలో పనిచేస్తున్న కొందరు అధికారులు మాత్రం పీపీపీ యాన్యుటీ మోడల్‌ను అమలు చేసే తీరును తప్పుపడుతున్నారు. ఇండోర్‌లో మూడేళ్ల కిందట అధ్యయనం కోసం వెళితే అక్కడ రోడ్లను కాంట్రాక్టర్లు కేవలం ప్రకటనల ఆదాయంతోనే నిర్మాణం చేపట్టి, నిర్వహిస్తున్నారని గుర్తించామని, అదే విధానం జీవీఎంసీలో కూడా అమలు చేయాలని భావించినా, పలు కారణాలతో కార్యరూపం దాల్చలేదని చెబుతున్నారు. ఇప్పుడు జీవీఎంసీలో 88.3 కిలోమీటర్లు పొడవు కలిగిన 54 రోడ్ల నిర్మాణం, నిర్వహణ నిమిత్తం కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించడంతోపాటు ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయాన్ని కూడా పొందేలా నిబంధనలు రూపొందించడం సరికాదని అభిప్రాయపడుతున్నారు. దీనివల్ల కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూరుతుందని, ప్రకటన రూపంలో వచ్చే ఆదాయం జీవీఎంసీ కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని చెబుతున్నారు. ఈ విషయంలో కమిషనర్ పునఃపరిశీలించి జీవీఎంసీకి ఆర్థిక నష్టం కలగకుండా చూడాలని కోరుతున్నారు.

ఛ్ఛ్...టీడీఆర్‌లా!

... 3వ పేజీ తరువాయి

రిజిస్ట్రేషన్ల శాఖ చెబుతోంది. దీంతో ఈ పనులు ముందుకు సాగడదంలేదు.

మునిసిపల్ పన్నులకు ఉపయోగించుకునేలా చేస్తే మేలు

ఇప్పుడు టీడీఆర్‌లు భవన నిర్మాణాలకే ఉపయోగించుకోవాలని ఇస్తున్నారు. వీటిని జారీ చేసేది పురపాలక శాఖే కాబట్టి...ప్రజలు కట్టాల్సిన మునిసిపల్ పన్నులకు కూడా వీటిని ఉపయోగించుకునేలా అవకాశం ఇస్తే బాగుంటుంది. అప్పుడు టీడీఆర్‌లు అందరికీ ఉపయోగపడతాయి. వాటిని కొనడానికి అంతా ముందుకు వస్తారు. దీనివల్ల 90 శాతం వరకు రేటు లభించే అవకాశం ఉంది. ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంటే భూ సేకరణ కూడా సులువు అవుతుంది. ఇదే విషయాన్ని ఎంపీ శ్రీభరత్, మంత్రి లోకేశ్ లేఖలను ద్వారా కోరాము.

-ఒ.నరేశ్‌కుమార్, వైజాగ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్

73 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో డాక్టర్ కేవీ రమణ, కంపెనీల ప్రతినిధులు

కంచరపాలెం,నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 73 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. సీఐఐ-ఎంసీసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ మేళాలో టాటా ఎలక్ట్రానిక్స్ టీవీఎస్ గ్రూప్, పెన్నార్ ఇండస్ట్రీస్, హీరో మోటార్స్ తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. కళాశాలలో చదువుచున్న 100 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా, వారిలో 73 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ అభినందించారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.15 వేలు నుంచి రూ.20 వేలు ప్రారంభం వేతనం ఉంటుంది. కార్యక్రమంలో బ్రాంచ్ హెడ్ విద్యాసాగర్, ప్రతినిధులు అరుణ శ్రీ, రమేష్, అర్చన తదితరలు పాల్గొన్నారు.

స్కూలు బస్సుల నిర్వహణలో అప్రమత్తత అవసరం

- బస్సు, ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించిన రవాణా, ఆర్టీఏ, అగ్నిమాపక శాఖ అధికారులు

మురళీనగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విశాఖ సిటీ పోలీస్ ట్రాఫిక్ విభాగం, రోడ్డు రవాణా, అగ్ని మాపకశాఖల అధికారులు, సిబ్బంది సంయుక్తంగా గురువారం స్కూల్ బస్సులు, ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఆర్ అండ్ బీ జాతీయ రహదారిలోని శివశివాని ప్రైవేటు స్కూలు ఆవరణలో వాహనాలు నడిపే డ్రైవర్లకు అవగాహన కల్పించారు. దురదృష్టవశాత్తూ స్కూలు బస్సులు, ఆటోల్లో అగ్నిప్రమాదాలు సంభవిస్తే తక్షణ నివారణకు పాటించాల్సిన విషయాలపై సూచనలిచ్చారు. రవాణా శాఖ విశాఖ కార్యాలయ ఇన్‌చార్జి, డీటీసీ ఆర్సీహెచ్ శ్రీనివాసరావు వాహన యజమానులు, డ్రైవర్లతో మాట్లాడారు. వాహన రికార్డ్స్ విషయంలో ట్రాఫిక్ రెగ్యులేషన్‌పై అవగాహన కల్పించారు.

రోజురోజుకూ వాహనాల సంఖ్య పెరుగుతు న్నందున ముఖ్యంగా పిల్లలను స్కూళు, కాలేజీలకు చేరవేసే వాహనాల డ్రైవర్లు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కంచరపాలెం ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్, ఫైర్ డిపార్ట్‌మెంట్ అధికారి రమణ, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



బస్సు డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు, అధికారులు

కొండపై బదిలీల్లో స్వల్పమార్పులు

... 3వ పేజీ తరువాయి

వెళ్లి వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవద్దని అధికారులను హెచ్చరించారు. మరోవైపు నిత్యం ఘర్షణలు పడే ఉద్యోగికి వీఐపీలు వచ్చే కొండపై ఎలా విధులు కేటాయిస్తారంటూ కమిషనర్ కార్యాలయం ఆలయ అధికారులను ప్రశ్నించినట్టు తెలిసింది. అంతర్గత బదిలీలు చేసే ముందు ఎవరిని ఎక్కడ వేస్తున్నారో పరిశీలన చేసుకోవాలని హెచ్చరించారు. విజయనగరం విద్యార్థుల హాస్టల్‌లో పనిచేస్తున్న వ్యక్తిని వెంటనే కొండపై పారిశుధ్యం పర్యవేక్షణ విధుల నుంచి తప్పించి వెనక్కి పంపాలని ఆదేశించారు. అయితే విజయనగరంలో హాస్టల్ విద్యార్థులు కూడా సదరు ఉద్యోగి తమను వేధిస్తున్నాడని ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదులు పంపడంతో, విజయనగరం పంపకుండా కొండ దిగువన విధులు కేటాయించారు. అంతర్గత బదిలీల్లో ముగ్గురిని యథాస్థానాలకు పంపించారు.

రూ.1.12 కోట్ల చోరీ సొత్తు స్వాధీనం

... 3వ పేజీ తరువాయి

838.331 గ్రాముల బంగారం, రూ.3,10,500 నగదు, 22 మోటార్ సైకిళ్లు, కారు, సోనీ కెమెరాతోపాటు 505 సెల్‌ఫోన్‌లను రికవరీ చేశామన్నారు. వీటి విలువ రూ.1,12,03,480 ఉంటుందన్నారు. నగరంలో నేరాల నియంత్రణకు గత నెలలో 309 సీసీ కెమెరాలను ఏర్పాటుచేయడంతోపాటు 218 అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. చోరీల నియంత్రణతోపాటు అనుమానితులను గుర్తించి అదుపులోకి తీసుకునేందుకు వీలుగా రాత్రి, పగలు ప్రత్యేక గస్తీ బృందాలు, డ్రోన్ కెమెరాలతో నిర్మానుష్యప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. బాధితులకు రికవరీ చేసిన సొత్తుని అందజేసి, వారి అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో డీసీపీ లతామాధురి, ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, సీఐ కె.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరూ ఇళ్ల నిర్మాణం చేపట్టేలా చర్యలు

- ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు

మురళీనగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : టిడ్కో ఇళ్లు మంజూరైనప్పటికీ బ్యాంకు రుణసదుపాయం దూరమై ఇళ్లు పొందలేని లబ్ధిదారులకు సత్వరమే వారికి సొంతిళ్లు మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు. గురువారం జీవీఎంసీ 50, 51వ వార్డుల లబ్ధిదారులతో జీవిఎంసీ మాధవస్వామి కల్యాణమండపంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లబ్ధిదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. లోన్ ప్రక్రియలో ఎదురవుతున్న ఇబ్బందులే అధికంగా ఎదురవుతున్న నేపథ్యంలో ప్రధానంగా బ్యాంకు రుణాల మంజూరు విషయమైన చర్యలు తీసుకోవాలని ఆయన సభావేదిక నుంచి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ముత్యాలనాయుడు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నుంచి 50, 51వ వార్డుల అధ్యక్షులు, మహిళా నాయకులు ఇ.సుజాత తదితరులు హాజరయ్యారు.

జాతీయ స్కూల్ గేమ్స్‌కు విద్యార్థుల ఎంపిక

విశాఖపట్నం, స్పోర్ట్స్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్కూల్ గేమ్స్ ఆర్చరీ, బాక్సింగ్, షూటింగ్, స్విమ్మింగ్, సాఫ్ట్‌బాల్, ఉషూ క్రీడా పోటీలకు సంస్కృతి స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. విలువిద్య టోర్నీకి సీహెచ్ ప్రణీత్, ఎన్.మోహిత్, వి.ఆద్య, జి.జ్ఞానేష్, బాక్సింగ్ పోటీలకు క్రీతి పర్మార్, శ్రీష్టి పర్మార్, మధురిమ; స్విమ్మింగ్ పోటీలకు జి.రోషిణి, షూటింగ్ టోర్నీకి ఎస్.సురేంద్ర, సాయిరవి, త్రిష వర్మ, జహీర్ అలీ ఎంపిక కాగా... ఉషూ పోటీల్లో పి.అభినవ్, సాఫ్ట్‌బాల్ టోర్నీలో ప్రతీక్‌కుమార్ ప్రాతినిధ్యం వహించనున్నారు.

ఈ సందర్భంగా జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులను స్కూల్ సీఈవో కె.నిశాంత్, ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి బుధవారం అభినందించి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.



జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

అడ్డగోలుగా రాక్రీట్ వ్యవహారం

... 3వ పేజీ తరువాయి

నడుపూరుల్లో సుమారు 12 వేల ఇళ్ల నిర్మాణ బాధ్యతను వైసీపీ ప్రభుత్వం రాక్రీట్‌కు అప్పగించింది. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.8 లక్షలు ప్రభుత్వం మంజూరుచేసింది. అయితే సిమెంట్, ఇనుము, ఇసుక ప్రభుత్వమే సరఫరా చేసింది. మొత్తం యూనిట్ ఖరీదు రూ.1.8 లక్షల్లో మెటీరియల్ కాస్ట్ మినహా మిగిలిన మొత్తం నిర్మాణ సంస్థకు ఇవ్వాలని నిర్ణయించింది.

కానీ, రాక్రీట్ సంస్థ నాలుగు లేఅవుట్‌లలో మొదటి నుంచి అనుకున్న విధంగా పనులు చేయలేకపోయింది. కేటాయించిన మెటీరియల్ వినియోగంపై పక్కాగా రికార్డులు నిర్వహించలేదు. కొన్నిచోట్ల మెటీరియల్‌ను సంస్థ ఉద్యోగులు కొందరు విక్రయించుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. పైడివాడ అగ్రహారం, గంగవరంలో స్థానికంగా ఉండే కొందరు చోటా నేతలు ఇనుము, ఇసుక పట్టుకుపోయారు. నిర్మాణాల్లో కూడా నాణ్యత ఉండేది కాదు. ఈ విషయమై అప్పట్లో కొందరు అధికారులు ప్రశ్నిస్తే కంపెనీ ప్రతినిధులు ఎదురుతిరిగేవారు. మరికొందరు అధికారులు ఆ కంపెనీతో కుమ్మక్కైపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 'రాక్రీట్' సంస్థ పూర్తిగా పనులు నిలిపివేసి, జిల్లా నుంచి బిచాణా ఎత్తేసింది. ఈ నేపథ్యంలో బిల్లులు మంజూరును అధికారులు నిలిపివేయడంతో కంపెనీ కోర్టును ఆశ్రయించింది. దీంతో సుమారు ఏడాదికిపైగా రాక్రీట్‌కు ఇచ్చిన నాలుగు లేఅవుట్‌లలో ఇళ్లు అసంపూర్తిగానిలిచిపోయాయి. అధికారుల వద్ద ఉన్న వివరాల మేరకు పైడివాడ అగ్రహారం, నడుపూరుల్లో 8,044 ఇళ్లకుగాను ఒక ఇల్లు పూర్తిచేయగా...రూఫ్ స్థాయిలో 137 ఉన్నాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. గత ఏడాది వరకూ నిర్మించిన ఇళ్లకు రూ.26.76 కోట్లు మంజూరుచేయగా, రూ.6.02 కోట్లు విలువైన 2,17,348 సిమెంట్, రూ.12.03 కోట్ల విలువైన 2005 టన్నుల ఇనుము సరఫరా చేశారు. తాజాగా రాక్రీట్ అవినీతి గురించి మంత్రి వెల్లడించడంతో జిల్లాలో ఆ సంస్థ చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు, లేఅవుట్‌లలో మిగిలిన మెటీరియల్, ఇతర అంశాలపై విచారణ చేయాలని హౌసింగ్ అధికారులు నిర్ణయించారు. కాగా ఆయా లేఅవుట్‌లలో ఇతర కంపెనీలకు కేటాయించిన ఇళ్ల నిర్మాణాలు మాత్రం కొనసాగుతున్నాయి.

కుటుంబ కథా చిత్రం 'విచిత్ర'

డాబాగార్డెన్స్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రేక్షకుల హృదయాలను హత్తుకునే కుటుంబ కథా చిత్రం విచిత్ర సినిమా అని ఆ చిత్ర దర్శకుడు సైపుద్దీన్ మాలిక్ అన్నారు. గురువారం డాబాగార్డెన్స్‌లోని ఓ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిస్ ఫిల్మ్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నామని, హీరోగా రవి, హీరోయిన్‌గా శ్రేయ తివారి, నటులు జ్యోతి అపూర్వ, బేబీ శ్రీహర్షిణి, యసిక,రవిప్రకాష్, సూర్య, చత్రపతి శేఖర్, మీనా వాసన్ ముఖ్య పాత్రలు పోషించినట్టు చెప్పారు. అమ్మ సెంటిమెంట్ నేపథ్యంలో రూపొందించిన ఈ చిత్రంలో తల్లి ప్రేమ, త్యాగం, బంధం గురించి ఉంటుందన్నారు. ఇప్పటికే సెన్సార్ పూర్తి చేసుకుందని, త్వరలోనే విడుదల తేదీ ప్రకటిస్తామని తెలిపారు. కథ సిస్ ఫిల్మ్ అందించగా, ఎడిటింగ్ కడిమిశెట్టి లక్ష్మీనారాయణ, సంగీతం నిజాని అంజన్ అందించారని చెప్పారు.

కళ్లద్దాలు పంపిణీ

అల్లిపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 41వ వార్డు పరిధిలోని జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ కళాశాల ఆధ్వర్యంలో గతంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలోని రోగులకు వార్డు నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ గురువారం కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

శివాలయానికి వెండి వస్తువులు బహూకరణ



ఆలయ అర్చకుడికి వెండి వస్తువులను అందిస్తున్న దాతలు

అల్లిపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నేరెళ్ల కోనేరు ప్రాంతంలో ఉన్న అరుణాచల లింగేశ్వర శివాలయానికి 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు శఠగోపం, ఉద్దరణి, పళ్లెం వంటి వెండి వస్తువులను బహూకరించారు. తొలుత అర్చకుడు దాత నాగరాజు గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కందుల బద్రీనాథ్, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

కైలాసపురంలో అన్నసమారాధన

అక్కయ్యపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 46వ వార్డు కైలాసపురం జంక్షన్‌లోని ఉమా కాశీవిశ్వేశ్వర లక్ష్మీనారాయణ ఆలయంలో ధర్మకర్త లాలం అర్జున్ ఆధ్వర్యంలో మాలలు ధరించిన భక్తులకు గురువారం అన్నసమారాధన నిర్వహించారు. పదేళ్ల నుంచి ఏటా 41 రోజుల పాటు దీక్ష చేసిన వారికి అన్న సమారాధన నిర్వహిస్తున్నట్టు ధర్మకర్త అర్జున్ తెలిపారు. ఈ ఈ కార్యక్రమంలో 45వ వార్డు కార్పొరేటర్ కంపా హనోక్, టీడీపీ నాయకుడు పైలా ముత్యాలనాయుడు, బత్తిని మురళీ, గొర్లె చందు, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన, గరుడ సేవ

సింహాచలం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా గురువారం స్వర్ణ పుష్పార్చన, గరుడ సేవ వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించి వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలను తీసి భక్తులతో స్పృశింపజేశారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు స్వర్ణ సంపెంగలతో పూజ చేశారు. తరువాత పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. అనంతరం రజిత గరుడ వాహనంపై ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉంచి పూజలు చేశారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.



ప్రేమ సమాజం రోడ్డులో బడ్డీలు



ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్న వాహనాలు

ప్రమాదాలు జరుగుతున్నా.. పట్టదా?

- 31వ వార్డులో ఫుట్‌పాత్‌లు, కాలువల ఆక్రమణ
- రాకపోకలకు వాహనదారుల అవస్థలు
- గంటల తరబడి నిలిచిపోతున్న ట్రాఫిక్

డాబాగార్డెన్స్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : డాబాగార్డెన్స్ ప్రాంతమంటే తెలియనివారుండరు. 31వ వార్డులో ఉన్న ఈ ప్రాంతంలో రోజురోజుకు ట్రాఫిక్ ఇబ్బందులు పెరిగిపోతున్నాయి. డాబాగార్డెన్స్ జంక్షన్, లక్ష్మీస్ట్రీట్, శారదా స్ట్రీట్ డౌన్, ఇన్‌కమ్ ట్యాక్స్ కార్నర్, ప్రేమ సమాజం రోడ్డులో ఈ సమస్య అధికంగా ఉంది. ఆయా ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై వివిధ వాణిజ్య దుకాణాలకు చెందిన వస్తువులను కొందరు తమకు నచ్చిన వాటిని పెట్టేసి ఎంచక్కా కాలం గడిపేస్తుంటే.. కాలువలను తమకే పూర్తిగా రాసేసినట్టుగా కొందరు బడ్డీలను, ఇతరత్రా ఉంచేసి తీవ్ర అసౌకర్యానికి గురిచేస్తున్నారు. ఇవేమీ మనకు సంబంధం లేదన్న విధంగా భారీ వాహనాలు గంటల తరబడి రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. నిత్యం వేలాది మంది ఈ ప్రాంతాల మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. దాదాపు 10 పాఠశాలలు, రెండు కళాశాలలు ఇదే మార్గంలో ఉండడంతో విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా ఉంటోంది. ఇటువంటి తరుణంలో ఆయా ప్రాంతాల్లోని పాదచారులు నడిచేందుకు లేదా సజావుగా వాహనదారులు వెళ్లేందుకు అవకాశం లేకుండాపోతోంది. చాలా మంది రోడ్డు మధ్యలోనే కష్టపడి నడవాల్సిన దుస్థితి నెలకొంది. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై నడిచేందుకు వీలు లేకపోవడంతో ప్రమాదాల బారిన పడి కాలు, చేతులకు దెబ్బలు తగులుతున్నాయి. ఇదే సమస్యతో రెండు రోజుల కిందట వృద్ధుడు మృతి చెందిన సంగతి విదితమే. ట్రాఫిక్, జీవీఎంసీ అధికారులు ఆక్రమణలు తొలగించి, రాకపోకలకు మార్గం సుగమం చేయాలని పాదచారులు, వాహనదారులు కోరుతున్నారు.



శారదా స్ట్రీట్‌లో రోడ్డుపైనే వ్యాపార సామగ్రి

భయంగా భయంగా నడవాల్సి వస్తోంది



టూ టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి సరస్వతీ పార్కు డౌన్ రోడ్డు వెళ్లే సమయంలో రహదారిపై ఇష్టానుసారంగా రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు, మరికొందరు వాణిజ్య సముదాయాలకు చెందిన సామగ్రి పెట్టేయడంతో రోడ్డు మధ్యనే నడవాల్సి వస్తోంది. తక్షణమే పాదచారులు నడిచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. - వై.రోహిణి

ఉక్కు పరిరక్షణకు చిత్తశుద్ధితో ఉన్నాం

... 3వ పేజీ తరువాయి

విశాఖ ఉక్కు కర్మాగారం కోసం రూ.11,500 కోట్ల ప్యాకేజీ మంజూరు చేయడమే తమ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. విశాఖ ఉక్కు సెంటిమెంట్‌ను సీఎం చంద్రబాబునాయుడు...కేంద్ర మంత్రి అమిత్‌షా, ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌లకు చెప్పడం ద్వారా ప్యాకేజీ సాధించామని ఆయన పేర్కొన్నారు.

గుర్రంపాలెంలో మళ్లీ గ్రావెల్ అక్రమ తవ్వకాలు

... 3వ పేజీ తరువాయి

ఇచ్చింది. ఈ సమస్య ఇంకా కొలిక్కి రాకపోవడంతో రెవెన్యూ రికవరీ యాక్టు అమలుచేయాలని గనుల శాఖ యోచిస్తోంది. ఇదిలావుండగా పారిశ్రామిక లేఅవుట్‌లో ప్లాటు కొనుగోలు చేసిన ఒకరు...కూటమి నేత సాయంతో సమీప కొండపై పొక్లెయిన్‌తో గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారు. ఈ విషయాన్ని గ్రామస్థులు కొందరు పెందుర్తి రెవెన్యూ అధికారులు, గనుల శాఖకు ఫోన్ చేసి చెప్పారు. గత ఏడాది లేఅవుట్‌కు ఆనుకుని ఉన్న ఒక కొండను పూర్తిగా తవ్వేసిన అక్రమార్కులు, ఇప్పుడు అదే ప్రాంతంలో మరో కొండపై కన్నేశారు.

పాత పోస్టాఫీసు జంక్షన్‌లో బస్ షెల్టర్ లేక అవస్థలు

మహారాణిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పాత పోస్టాఫీసు జంక్షన్‌లో బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నగరంలో ఏ మూల నుంచి అయినా పాత పోస్టు ఆఫీస్ వైపే ఆఖరి మజిలీ. జిల్లాలో ఆర్టీసీ బస్సులు రోడ్డెక్కిన దగ్గర నుంచి పాత పోస్టాఫీస్ బస్‌స్టాప్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉండేది. ఆర్టీసి సిబ్బందికి ఇక్కడ ప్రత్యేకంగా విశ్రాంతి గది ఉండేది. ప్రయాణికుల కోసం రెండు, మూడు బస్ షెల్టర్‌లు కూడా ఉండేవి. విశాఖ మున్సిపల్ కార్యాలయం, రిజిస్ట్రార్ ఆఫీస్, డీఈవో కార్యాలయం, పోర్టుట్రస్టు, సింధియా, షిపింగ్ కార్యాలయాలు, ఫిషింగ్ హార్బర్, అనేక పేరొందిన పాఠశాలలతో పాటు పూర్ణామార్కెట్, కురుపాం మార్కెట్, బంగారు ఆభరణాల షాపులు, కనకమహాలక్ష్మి ఆలయం కూడా అదే రహదారి. దీంతో నిత్యం ప్రజలు ఆ రహదారి గుండానే ప్రయాణం చేసేవారు. నగరంలోని గాజువాక, సింహాచలం, పెందుర్తి, మధురవాడ, భీమిలి తదితర ప్రాంతాల నుంచి బస్సులు పాత పోస్టాఫీసు వరకు ఉండేవి. ఇప్పుడు మహా నగరం విస్తరణతో అక్కడ ఉండే ప్రధాన కార్యాలయాలు, దుకాణాలు నగరం నలుమూలలకు మారాయి. దీనితో అటువైపు వెళ్లే వారి సంఖ్య తగ్గిపోయింది. పాతపోస్టాఫీస్ బస్టాప్ గత వైభవాన్ని కోల్పోయింది. అక్కడ కనీసం బస్‌షెల్టర్ కూఢ లేకుండా పోయింది. ఇప్పుడు వన్‌టౌన్ కోటవీధి, జాలారిపేట ప్రజలు అక్కడే బస్సులు అందుకుంటున్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకం కారణంగా అనేక మంది బస్సు ప్రయాణానికి వస్తున్నారు. వారు బస్సుల కోసం వేచి చూసేందుకు కనీసం బస్టాప్ లేకుండా పోయింది. ఆర్టీసీ సిబ్బందికి కూడా ఎటువంటి షెల్టర్ లేదు.



బస్ షెల్టర్ లేక ఆరు బయట నిల్చున్న ప్రయాణికులు

సంకల్ప్‌తో సంసిద్ధం

... 3వ పేజీ తరువాయి

అర్థమయ్యేవిధంగా బోధించి, సాధన చేయించాలి.

పక్కాగా అమలు చేస్తాం



ఇంటర్మీడియట్ బోర్డు ప్రవేశపెట్టిన సంకల్ప్-2026ను జిల్లాలోని అన్ని కళాశాలల్లో పక్కగా అమలుచేస్తాం. బోర్డు విడుదల చేసిన షెడ్యూల్‌ను జూనియర్ కళాశాలలకు పంపించి, ప్రిన్సిపాల్స్‌తో సమావేశం నిర్వహించాం. వెనుకబడిన విద్యార్థులకు లాంగ్, షార్ట్ ప్రశ్నలు నేర్పించి పరీక్షలకు సిద్ధం చేస్తాం. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో ఫలితాల సాధనకు కృషి చేస్తున్నాం.

- పి.ఉమారాణి, జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి.

సాయిబాబాకు పూజలు

అగనంపూడి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి షిర్డీసాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారిని నూతన వస్త్రాలతో అలంకరించారు. అనంతరం పూజలు చేశారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సేవా సమితీ ఆర్థిక సాయంతో అన్నసమారాధన చేశారు. అనంతరం ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం భజనా కార్యక్రమం ఏర్పాటు చేసి భక్తి గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అగనంపూడి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి సెక్షన్ కార్యాలయం పరిధిలో గల మంగళపాలెం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, ఇండోర్ సబ్‌స్టేషన్ లైన్ల నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఎస్ రామకృష్ణ ప్రకటనలో తెలియజేశారు. ఈ సదర్భంగా డొంకాడ, బీసీ కాలనీ, కొండయ్యవలస, సాయినగర్, దానబోయినపాలెం, తలారివానిపాలెం, అండమాన్ కొండయ్యవలస, ప్రాంతీయ ఆస్పత్రి, పెదమడక, పినమడక, గల్లావానిపాలెం, శనివాడ, జాబిలిహిల్స్, పాతఅగనంపూడి, శాంతినగర్, దువ్వాడ సెక్టర్ -1, సెక్టార్- 2, మంగళపాలెం, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, వెదుళ్లనరవ, గంగవరం, శెట్టిపాలెం, లంకివానిపాలెం, నంగినారపాడు, వి.కొత్తూరు, అజనగిరి గ్రామాల ప్రజలు తమకు సహకరించాలని కోరారు.

జాతీయ స్విమ్మింగ్ పోటీలకు ఉక్కునగరం విద్యార్థి


చేతన్‌శివాశిష్

గాజువాక, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నగరంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో ఉక్కునగరం లిటిల్ ఎంజెల్స్ స్కూల్ విద్యార్థి జి.చేతన్ శివాశిష్ సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. చదువుతో పటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పాఠశాల ప్రిన్సిపాల్ పి.విశాలాక్షి అన్నారు. అనంతరం విద్యార్థిని అభినందించారు. 29 నుంచి వచ్చే నెల 5 వరకు ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో చేతన్ శివాశిష్ పాల్గొంటాడని తెలిపారు.

ముగిసిన షష్ఠి వేడుకలు

ఎన్.ఎ.డి.జంక్షన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 52వ వార్డు ఎన్ఏడీ దగ్గర ఉన్న సుబ్రహ్మణ్య స్వామివారి 28వ షష్ఠి వేడుకలు గురువారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా వేకువజామునుంచే స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. దాదాపు 2000 మంది అయ్యప్ప భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **ఆంధ్రా కింగ్ తాలూకా** : శరత్, మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య (గాజువాక), ఎస్.వి.సి. లిఖిత (శ్రీహరిపురం),
- **ప్రేమంటే** : సంగమ్, కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీవెంకటేశ్వర-1, ఎస్.వి.సి. గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి).
- **12ఎ రైల్వే కాలని** : లీలామహల్, రామ, నటరాజ్ (పెందుర్తి). మిని మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతా రామయ్య (పరవాడ),
- **కాంత** :
- **రాజు వెడ్స్ రాంబాయి / మఫ్టీపోలీసు** : జగదాంబ
- **శిసు / రాజు వెడ్స్ రాంబాయి** : శారదా
- **పాంచ్‌మినార్ / ఇట్లు మీ ఎదవ** : రమాదేవి
- **ది గర్ల్ ఫ్రెండ్** :శ్రీకన్య, కిన్నెర (మద్దిలపాలెం), నటరాజ్-2 (పెందుర్తి).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 52, వంకాయలు (తెలుపు) 54, వంకాయలు (నలుపు) 70, బెండకాయలు 54, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 48, బీరకాయలు 50, ఆనపకాయ 26,కాలీఫ్లవర్ 34, క్యాబేజీ 22, క్యారెట్ 56, దొండకాయలు 34, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 70, బరబాటి 46, ముల్లంగి 48, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 56, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 64, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 50, కీరదోస 30, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 26, చేమ దుంపలు 30, చిలగడదుంపలు 38, కంద 50, దేముడు చిక్కుడు 66, గోరు చిక్కుడు 56, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 180, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 70, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 20, మామిడి అల్లం 64, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	610
విజయనగరం	614
శ్రీకాకుళం	614

చికెన్ ధరలు బ్యాగ్

రైతు ధర	98
లైవ్ ధర	118
విత్ స్కిన్	206
స్కిన్‌లెస్	216

ప్రధాన రహదారిలో ప్రమాదకర మలుపులు

- వీధిలైట్లు లేకపోవడంతో చీకట్లో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- మలుపుల్లో హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుచేయాలని వినతి


లక్కరాజుపాలెం సమీపంలో మలుపు


కోళ్లఫారాల వద్ద ఉన్న మలుపు

అగనంపూడి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి అగనంపూడి ఆంజనేయ స్వామి ఆలయం కూడలి నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారిలోని మలుపులు ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. స్థానిక లక్కరాజుపాలెం, కోళ్లఫారాల వద్ద, దువ్వాడ గ్రామానికి చేరువలో మలుపులు 'యూ', 'ఎస్' ఆకారాల్లో ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చేంత వరకు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అగనంపూడి పరిసర ప్రాంతాల ప్రజలు దువ్వాడ రైల్వే స్టేషన్, వీఈపీజెడ్‌కు వెళ్లే ఉద్యోగులు ఈ రహదారిలోనే ప్రయాణిస్తుంటారు. ఈ మలుపుల్లో హెచ్చరిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో వీధిలైట్లు లేకపోవడంతో రాత్రిళ్లు ఈ రహదారిలో ప్రయాణించాలంటే వాహనదారులు హడలిపోతున్నారు. ఐదేళ్ల క్రితం జీవీఎంసీ నిధులు వెచ్చించి ఈరహదారిని విస్తరించింది. అయినా మలుపుల వద్ద ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఈ మలుపుల్లో పలు ప్రమాదాలు జరిగిన సంఘటనలు చాలానే ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మలుపుల వద్ద భయమేస్తోంది



అగనంపూడి నుంచి దువ్వాడ వెళ్లే రహదారిలో ప్రయాణించాలంటే మలుపుల వద్ద భయమేస్తోంది. దగ్గరకు వచ్చేంత వరకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు , లైట్లు ఏర్పాటు చేయాలి. అధికారులు చొరవ తీసుకుని ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి.

-అట్టా రమేశ్, అగనంపూడి

ఏసీబీ వలలో మారేడుపూడి వీఆర్వో

- రూ.20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం



అనకాపల్లి టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భూమి మ్యూటేషన్‌కు రూ.20 వేలు లంచం తీసుకుంటూ మారేడుపూడి వీఆర్వో ఎం.సూర్యనారాయణ గురువారం ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ బీవీఎస్ఎస్ రమణమూర్తి తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. అక్కిరెడ్డివానిపాలెం గ్రామానికి చెందిన సాలాపు సంజీవరావుకు 24 సర్వే నంబర్లలో కలిపి మొత్తం మూడున్నర ఎకరాల భూమి ఉంది. సంజీవరావు మే 30న మరణించారు. ఆయన పేరున ఉన్న భూమిని తన తల్లి దేముడమ్మ పేరున మార్చాలని కుమారుడు శ్రీను సెప్టెంబరులో వీఆర్వోకు దరఖాస్తు చేసుకున్నారు. 24 సర్వే నంబర్లకు సంబంధించి 19 సర్వే నంబర్లలోని భూమికి వీఆర్వో మ్యూటేషన్ చేశారు. మిగిలిన ఐదు సర్వే నంబర్లలో ఉన్న భూమిని మ్యూటేషన్ చేయడానికి రూ.50 వేలు లంచం అడిగారు. బుధవారం మధ్యాహ్నం వీఆర్వోను శ్రీను కలిసి రూ.20 వేలు ఇస్తానని చెప్పడంతో వీఆర్వో అంగీకరించారు. లంచం ఇవ్వడానికి మనసు అంగీకరించక శ్రీను బుధవారం ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచన మేరకు గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చారు. అక్కడ వీఆర్వో సూర్యనారాయణకు రూ.20 వేలు లంచం ఇవ్వగా, మాటు వేసి ఉన్న ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో సీఐ, సిబ్బంది వీఆర్వోను అరెస్టు చేశారు. గతంలో కూడా ఆయనపై అభియోగాలు ఉన్నట్టు తమ దృష్టికి వచ్చిందని, వాటిపై కూడా విచారణ చేస్తామని డీఎస్పీ తెలిపారు. వీఆర్వోను శుక్రవారం ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నామన్నారు. పెందుర్తి సమీపంలోని సుజాతనగర్‌లో గల వీఆర్వో ఇంట్లో కూడా ఏసీబీ అధికారి తనిఖీలకు వెళ్లినట్టు తెలిసింది.

హిందీ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత


సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో తొలిసారిగా ఇస్లాంపేట హైస్కూల్‌లో నిర్వహించిన పరిచయ, ప్రాథమిక పరీక్షల్లో విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించారని హెచ్ఎం జి.ప్రమీల తెలిపారు. సెప్టెంబర్ నెలలో సోఫియా తబాసియమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షల్లో 60మంది విద్యారులు పాల్గొనగా అందరూ ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ


పుస్తకాలు తీసుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

వేపగుంట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వేపగుంట హైస్కూల్లో ఎన్ఎమ్ఎస్ఎస్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తయారు చేసిన స్టడీ మెటీరియల్‌ను గురువారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టీఆర్.అంబేడ్కర్ మాట్లాడుతూ ఈ స్టడీ మెటీరియల్ ద్వారా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు పొందేందుకు ఎంతో అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూడికలతో నిండిన డ్రైనేజీలు


పూడికతో నిండిన డ్రైనేజీ

పెదగంట్యాడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హెచ్‌బీకాలనీ, డెయిరీకాలనీ, కోరాడ ప్రాంతాల్లోని ప్రధాన డ్రైనేజీలు పూడికతో నిండిపోయాయి. ఎగువ ప్రాంతాల నుంచి మురుగుతో పాటు వచ్చిన ప్లాస్టిక్, పాలిథిన్, ఇతర వ్యర్థాలు ఈ డ్రైనేజీల్లో నిలిచిపోయి, మురుగు రహదారిపై ప్రవహిస్తోంది. వారాల తరబడి మురుగు, వ్యర్థాలు నిలిచిపోవడంతో దాని నుంచి దుర్వాసన వస్తోందని, దోమలు విపరీతంగా ప్రబలతున్నాయని స్థానికులు పేర్కొన్నారు. పెదగంట్యాడ నిర్వాసిత కాలనీలైన సీతానగరం, నెల్లిముక్కు, దుర్గవానిపాలెం, మొల్లివానిపాలెం, అయ్యన్నపాలెం, శీకువానిపాలెం, బర్మాకాలనీ, డెయిరీ కాలనీ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన మురుగు అంతా ఇదే డ్రైనేజీ నుంచే ప్రవహిస్తోంది. అయితే ఈ డ్రైనేజీ పూడికతో నిండిపోవడం వల్ల మురుగు నిలిచిపోతోంది. జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం ఎప్పటి కప్పుడు మురుగు తొలగించకపోవడం వల్ల ఇటువంటి పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చురుగ్గా ఫుట్‌ఓవర్‌వంతెన నిర్మాణం


ఫుట్‌ఓవర్‌వంతెనకు తుదిమెరుగులు దిద్దుతున్న దృశ్యం

గోపాలపట్నం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సింహాచలం రైల్వే స్టేషన్ వెనుకభాగంలో ఉన్న చంద్రనగర్, ఎల్లపువానిపాలెం ప్రాంత ప్రజల సౌకర్యం కోసం నిర్మిస్తున్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయి. సింహాచలం రైల్వే స్టేషన్ వెనుక భాగంలో ఉన్న పలు కాలనీల ప్రజలు కాలినడకన గోపాలపట్నం చేరాలంటే సింహాచలం రైల్వే స్టేషన్ వద్ద ఉన్న రైలు ట్రాక్‌లు దాటుకుంటూ ప్రధాన రహదారికి చేరుకునేవారు. ఈ క్రమంలో ప్రమాదాలు జరిగేవి. దీంతో మూడు దశాబ్దాల క్రితం సింహాచలం రైల్వే స్టేషన్‌లోని ఫుట్‌ఓవర్ వంతెనకు అనుసందానం చేస్తూ చంద్రనగర్ వరకు ఫుట్‌ఓవర్ వంతెన నిర్మించారు. కాలక్రమేణ ఈ వంతెన శిథిలావస్థకు చేరకుంది. కొత్త ఫుట్‌ఓవర్‌వంతెన నిర్మాణం చేపట్టాలనే ప్రతిపాదన చేశారు. సింహాచలం రైల్వే స్టేషన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా చంద్రనగర్ ఫుట్ ఓవర్‌వంతెన నిర్మాణం కూడా ప్రారంభించారు. ప్రస్తుతం ఈ ఫుట్‌ఓవర్ వంతెన నిర్మాణ పనులు తుదిదశలో ఉన్నాయి. కొన్ని రోజుల్లో ఈ వంతెన అందుబాటులోకి రానుంది.

'స్టీల్‌సిటీ డిపోను తరలించొద్దు'

- 91వ రోజూ కొనసాగిన రిలే నిరాహార దీక్షలు

కూర్మన్నపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల అవసరాల మేరకు కూర్మన్నపాలెం స్టీల్‌సిటీ ఆర్టీసీ డిపోను కొనసాగించాలని, తరలింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని కోరుతూ ఎన్ఎంయూ ఆధ్వర్యంలో గురువారం 91వ రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఎన్ఎంయూ స్టీల్‌సిటీ డిపో కార్యదర్శి ఎస్‌వీ.రమణ మాట్లాడుతూ 1990లో స్టీల్‌సిటీ ఆర్టీసీ డిపోను యాజమాన్యం ఏర్పాటు చేసిందని, అప్పట్లో రూ.1.5 కోట్లుతో పరిపాలనా భవనం, గ్యారేజ్, బస్ కాంప్లెక్స్ నిర్మించారని అన్నారు. ఉక్కు యాజమాన్యంతో 33 సంవత్సరాల స్టీలుసిటీ డిపో లీజు ఒప్పందం ముగియడంతో ఆ స్థలాన్ని ఖాళీ చేయాలని ఆర్టీసీ యాజమాన్యానికి ఉక్కు యాజమాన్యం నోటీసులు జారీ చేసిందన్నారు. ప్రస్తుత భూమి విలువ ఆదారంగా లీజు చెల్లించాలని, వడ్డీలేని సెక్యూరిటీ డిపాజిట్, సేవా చార్జీలుగా రూ.138 కోట్లు కోరడం తగదన్నారు. లీజును పొడిగించి సహకరించాలని స్టీల్‌సిటీ ఎన్ఎంయూ కార్మికులు కోరుతున్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ కార్మికులు పాల్గొన్నారు.

దుకాణదారుడిపై కేసు నమోదు

- సౌందర్యం పెంపు పేరుతో ఔషధాలు విక్రయిస్తుండడంతో చర్యలు

సిరిపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సౌందర్యం పెంపు పేరుతో ఎటువంటి అనుమతుల్లేకుండా ఔషధాలను విక్రయిస్తున్న దుకాణ యజమానిపై జిల్లా ఔషధనియంత్రణ అధికారులు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి విశాఖ ఔషధ నియంత్రణ శాఖ సహాయ సంచాలకులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని ఎంవీపీ కాలనీలో ఎటువంటి అనుమతుల్లేకుండా సుహం క్లినిక్ అండ్ డయాగ్నస్టిక్ సెంటర్ నిర్వహిస్తున్నట్టు వచ్చిన ఫిర్యాదుల మేరకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వి.అభిప్రియ ఆధ్వర్యంలోని బృందం తనిఖీలు నిర్వహించారు.

ఆ దుకాణంలో ఎటువంటి అనుమతులు తీసుకోకుండా ఔషధాలు విక్రయిస్తున్నట్టు గుర్తించారు. సుమారు రూ.80 వేలు విలువ గలిగిన సౌందర్య సాధన ఔషధాలు స్వాధీనం చేసుకున్నట్టు సహాయ సంచాలకుడు విజయ్‌కుమార్ తెలిపారు. ఔషధాలను సీజ్ చేసి ప్రయోగశాలకు పంపించినట్టు తెలిపారు. దుకాణదారుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ పంపినట్టు ఆయన తెలిపారు.

స్కూల్ వ్యాన్ డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ఎన్.ఎ.డి.జంక్షన్,నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 52వ వార్డు కరాస శివశివాని స్కూల్‌బస్ డ్రైవర్లు, ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై ట్రాఫిక్ పోలీసులు, ఆర్‌టీవో అధికారులు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాహన ప్రమాదాలు జరిగినప్పుడు ఏ విధంగా వ్యవహరించాలనే అంశాల గురించి వివరించారు. అలాగే అగ్ని ప్రమాదాలు జరిగినపుపడు ఫైర్ ఎక్సాస్టర్లను ఏ విధంగా వాడాలనే అంశాలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ. శ్రీనివాసరావు, డీటీవో శ్రీనివాస్, ఫైర్ ఆఫీసర్ రామారావు పాల్గొన్నారు.

జింక్ భూముల్లో సర్వే


జింక్ స్థలంలో బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

మల్కాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ములగాడ తహశీల్దార్ రమేశ్ నాయుడు పర్యవేక్షణలో జింక్ పరిశ్రమకు సంబంధించిన భూముల్లో నాలుగు రోజులుగా సర్వేలు జరగుతున్నాయి. 1970 జింక్ పరిశ్రమ నిర్మాణ సమయంలో రైతుల నుంచి సేకరించిన భూములతో పాటు ప్రభుత్వం కేటాయించిన భూములను యాజమ్యాం పొందింది. ఈ పరిశ్రమ నుంచి కాలుష్యం ఎక్కువ రావడంతో పరిశ్రమలో కీలకమైన లెడ్‌ప్లాంట్‌ను 1998లో మూసేశారు. ఆ తరువాత జింక్ నష్టాల్లో నడిచింది. దీంతో ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడంతో 2010లో పరిశ్రమను మూసేశారు. అయితే కంపెనీ యజమాన్యం ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఓ లేఖను రాశారు. పరిశ్రమలో ఎంత భూమి ఉందో అంతా తమకే అమ్మేయాలని కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఈ భూములపై సర్వే చేయించాలని సూచించారు. ఈ నేపథ్యంలో ములగాడ మండలం అధికారులు భూమి సర్వే చేస్తున్నారు. అప్పట్లో పరిశ్రమకు ప్రభుత్వం ఇచ్చిన భూమితో పాటు దాదాపుగా వంద ఎకరాలపైనే ప్రభుత్వ భూమిని ఆక్రమించి గోడ నిర్మించినట్టు రెవెన్యూలో గుసగుసలు. ఈ విషయం బయటకు తెలియడంతో ఈ భూమిని స్వాధీనం చేసుకుని ప్రభుత్వ అవసరాలకు ఉపయోగించుకోవాలని అధికారవర్గం భావిస్తున్నారు. ఈ భూమిలో తహశీల్దార్ కార్యాలయం, జీవీఎంసీ జోన్-5 కార్యాలయం నిర్మిస్తే బాగుంటుందని భావిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. జింక్‌కు చెందిన భూములు ఎదురువానిపాలెం 12/7ఎ, 12/8 సర్వేనంబర్లులో ఉన్నట్టు ములగాడ మండల రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఈ భూముల్లో జింక్ అధికారులు బోర్డులు ఏర్పాటు చేశారు.


బాధితులకు చెక్కును అందజేస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పి.గణబాబు

గోపాలపట్నం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. నియోజకవర్గంలోని పలు వార్డులకు చెందిన 10 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.7.80 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను గణబాబు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- టీడీపీ యువ నాయకుడు పి.మౌర్యసింహ

మల్కాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తూ మన్ననలు పొందుతోందని టీడీపీ పశ్చిమ నియోజకవర్గం నాయకుడు మౌర్యసింహ పేర్కొన్నారు. 59వ వార్డు కొత్తనక్కవానిపాలెంలో టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు నక్క లక్ష్మణరావు ఆధ్వర్యంలో గురువారం మౌర్యసింహ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్‌కట్‌చేసి మాట్లాడారు. పార్టీని నమ్ముకున్న వారికి ఎప్పుడూ న్యాయం జరగుతుందని అన్నారు. ఈ సందర్భంగా పలువురు పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామిక ప్రాంతం టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలి

గోపాలపట్నం: సామాజిక సేవా కార్యక్రమాల్లో అందరూ భాగస్వామ్యులు కావాలని టీడీపీ పశ్చిమ నియోజకవర్గం నాయకుడు పి.మౌర్యసింహ పిలుపునిచ్చారు. కొత్తపాలెం కూడలిలో స్థానిక పీఏసీఎస్ ఛైర్మన్ బొడ్డేటి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలకు హెల్మెట్లను గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మౌర్యసింహ ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యకర్తలకు హెల్మెట్లను అందించారు. అనంతరం విజయ్‌కుమార్‌ను అభినందించారు.

న్యూ ఐటీఐలో 'సర్వీసెస్ టెక్నీషియన్' శిక్షణ

గాజువాక, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గాజువాక స్టీల్‌సిటీ ప్రభుత్వ న్యూ ఐటీఐలో స్కిల్‌హబ్ ద్వారా ఫోర్ వీలర్ సర్వీసెస్ టెక్నీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా నిరుద్యోగులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై 18-35ఏళ్ల వయస్సు కలిగిన వారు ఈ శిక్షణకు అర్హులను తెలిపారు. వచ్చే నెల 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 81217 43777 నంబరకు సంప్రదించాలని సూచించారు.

ఉత్పత్తితో వేతనాలు ముడిపెడితే ప్రతిఘటిస్తాం

- ఉక్కు అఖిల పక్ష కార్మిక సంఘం నాయకుల హెచ్చరిక


ధర్నాలో పాల్గొన్న ఉక్కు అఖిల పక్ష కార్మిక సంఘం నాయకుల

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తితో వేతనాలు ముడిపెడుతూ ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేకపోతే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘం నాయకులు యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఉత్పతి ఆధారిత వేతనాలు ఇస్తామని ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం ముందు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నేడు ఉక్కు ఉద్యోగులు పొందుతున్న వేతనాలు యాజమాన్యం, ప్రభుత్వాలు దయతో ఇచ్చినవి కాదన్నారు. ఏడాదిగా పూర్తి వేతనాలు చెల్లించకుండ యాజమాన్యం కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. కార్మికులకు ఆర్థిక ప్రయోజనాలు తొలగించారని, ముఖ్యంగా టౌన్‌షిప్‌లో నివాసముంటున్న వారికి విపరీతంగా విద్యుత్ చార్జీలు పెంచేశారన్నారు. పూర్తి వేతనాలు చెల్లించాలని కోరుతుంటే చట్ట విరుద్ధమైన ఉత్తర్వులు ఇచ్చిందని ఆరోపించారు. ఉత్పత్తి హెచ్చు తగ్గుదలకు ఉద్యోగుఉ బాధ్యులు కాదని పేర్కొన్నారు. కర్మాగారంలో యంత్రాలు పూర్తిగా పాతబడిపోయాయని, వీటికి మరమ్మత్తులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని వినతి

అగనంపూడి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి, ఉక్కు నిర్వాసిత కాలనీలు, పరిసర ప్రాంత గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈపీడీసీఎల్ ఎస్ఈ జి.ప్రసాద్‌కు స్థానిక నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యుత్ సమస్యలను ఆయనకు వివరించారు. పెరిగిన విద్యుత్ కనెక్షన్‌లకు సరిపడ ట్రాన్స్‌ఫార్మర్‌లు లేకపోవడం వల్ల గ్రామాల్లో లోవోల్టేజీ సమస్య వస్తోందన్నారు. దీని కారణంగా గ్రామాల్లో పూర్తి స్థాయిలో లైట్లు వెలగక వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఏబీఎస్ విద్యార్థి ఎంపిక

అగనంపూడి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన అండర్-14 జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో ఈ-మర్రిపాలెం ఏబీఎస్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి నారపిన్ని జీవన్‌సాయి విశేష ప్రతిభ కనబరిచి ఈనెల 29న గుంటూరు జిల్లా పెరిచెర్ల పలకలూరులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరస్పాండెంట్ కొండయ్య, డైరెక్టర్ దీపక్, ప్రిన్సిపాల్ పద్మజాదీపక్ జీవన్‌సాయిని అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

'కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలి'

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తూ ప్రమాదవశాత్తు మంగళవారం మృతిచెందిన కాంట్రాక్టు కార్మికుడు డి.గోపాలకృష్ణ కుటుంబానికి న్యాయం చేయాలని ఉక్కు నిర్వాసిత సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని పేర్కొంటూ స్టీల్‌ప్లాంట్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలవురు నాయకులు మాట్లాడుతూ ఈ ప్రమాదంపై దర్యాప్తు చేపట్టాలని, అధికారులు నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రజలతో ఫ్రెండ్లీ పోలీస్‌గా ఉండండి

- పెందుర్తి సీఐ కేవీ సతీశ్‌కుమార్

పెందుర్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఫ్రెండ్లీ పోలీస్‌గా ఉంటే ప్రజల మన్ననలు పొందగలమని సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపారు. చిన ముషిడివాడలో సచివాలయ మహిళా పోలీసులతో 'శాంతి భద్రతలు, ఫ్రెండ్లీ పోలీసింగ్' అంశంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో పోలీసులంటే ఫ్రెండ్లీ భావన కల్పించాలని అన్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా ఉంటూనే అసాంఘీక పనులకు పాల్పడే వ్యక్తులను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. యాంటీ డ్రగ్స్, సైబర్ నేరాలపై ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్యం చేయాలన్నారు. కార్యక్రంలో 50 మంది సచివాలయం మహిళా పోలీసులు పాల్గొన్నారు.

3న హనుమత్ వ్రతం

సింహాచలం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి అనుబంధ సాక్షి ఆంజనేయస్వామి సన్నిధిలో డిసెంబరు 3న హనుమత్ వ్రతం నిర్వహించనున్నట్టు ఈవో ఎస్.సుజాత ప్రకటించారు. 1న గణపతి పూజ, పుణ్యాహవచనములు సుందరకాండ పారాయణతో శ్రీకారం చుడతారు. 2న సుందరకాండ పారాయణం, 3న ఉదయం పంచామృతాభిషేకం, లక్ష తమలపూజ, రామాయణ పట్టాభిషేక సర్గ పారాయణం, హవనం, పూర్ణాహుతి ఉంటాయన్నారు.

ప్రత్యేక రైళ్లు కొనసాగింపు

విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ మీదుగా చర్లపల్లి, బ్రహ్మపూర్, సంత్రాగచ్చి, యలహంక మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లను కొనసాగిస్తున్నామని సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. సంత్రాగచ్చి-యలహంక డిసెంబరు 4 నుంచి 25 వరకు, తిరుగు ప్రయాణంలో 6 నుంచి 27 వరకు అందుబాటులో ఉంటుంది. చర్లపల్లి-బ్రహ్మపూర్ డిసెంబరు 5 నుంచి జనవరి 30 వరకు, తిరుగు ప్రయాణంలో 6నుంచి జనవరి 31 వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

కొనసాగుతున్న మళ్లింపు

తూర్పు రైల్వే అసన్సోల్ డివిజన్‌లోనిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో అసన్సోల్, అందల్, సైంథియా జంక్షన్ మీదుగా మళ్లింపు మార్గంలో నడుస్తున్న పలు రైళ్లు డిసెంబరు 31 వరకు కొనసాగుతాయన్నారు.

పలు రైళ్ల గమ్యాలు కుదింపు

విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేకే లైనులో ఆధునికీకరణ పనుల నేపథ్యంలో పలు రైళ్ల గమ్యాలను కుదించామని సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. డిసెంబరు 2, 29, 16న విశాఖ-కిరండూల్ పాసింజర్ (58501) విశాఖ నుంచి కోరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖ పాసింజర్ (58502) కోరాపుట్ నుంచి విశాఖకు నడుస్తాయి. అలాగే డిసెంబరు 1, 15న భువనేశ్వర్-జగదల్‌పూర్ హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ (18447)భువనేశ్వర్ నుంచి కోరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్-భువనేశ్వర్ 2,16న కోరాపుట్ నుంచి భువనేశ్వర్ వరకు నడుస్తాయన్నారు.

శిశువు మృతి కేసులో పురోగతి!

విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అప్పుడే పుట్టిన శిశువు శరీరభాగాలను ముక్కలుగా నరికేసి కంచరపాలెం సంజీవయ్యకాలనీ కాలువలో పడేసిన కేసులో పురోగతి సాధించామని సీపీ శంఖబ్రతబాగ్చి తెలిపారు. కాలువలో తల, మొండెం, కాళ్లు, చేతులు వేరుచేసిన నవజాతశిశువు ఈనెల 20న తెల్లవారుజామున బయటపడిన విషయం తెలిసిందే. దీనిపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారన్నారు. హత్యచేసి శరీరభాగాలు అక్కడపడేశారా? చనిపోయిన శిశువుని ముక్కలుగా చేసి పడేశారా? అనేదానిపై ఆధారాల కోసం కృషి చేయడంతో సమీపంలోని సీసీ కెమెరా ఫుటేజీ అనుమానితుడిని గుర్తించామన్నారు. త్వరలోనే నిందితులను గుర్తించి కేసును ఛేదిస్తామన్నారు.

కనకమహాలక్ష్మీ... కరుణించవమ్మా!

- అమ్మవారికి వైభవంగా తొలి గురువారం పూజలు
- దర్శనానికి అర్ధరాత్రి నుంచి పోటెత్తిన భక్తులు

మహారాణిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో తొలి గురువారం పూజలు వైభవంగా జరిగాయి. అమ్మవారి దర్శనానికి అర్ధరాత్రి నుంచి భక్తులు పోటెత్తారు. దీంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. వేదమంత్రాలు నాదస్వరాల మధ్య గణపతి పూజ, పుణ్యాహవచనం, వేద పారాయణ, శ్రీ చక్రార్చన, లక్ష్మీ హోమం విశేష పూజలు నిర్వహించారు. దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఆలయ అధికారులు అర్ధరాత్రి తొలిపూజలు చేశారు. అనంతరం భక్తులు స్వయంగా అమ్మవారికి పసుపు కుంకుమ నీళ్లు, క్షీరాభిషేకం, పంచామృతాభిషేకాలు చేశారు. ఆ తరువాత అమ్మవారి విగ్రహాన్ని స్వర్ణాభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి రాత్రి 2.30 గంటల నుంచి భక్తుల దర్శనానికి అనుమతించారు. ఉదయం మరింతమంది భక్తులు రావడంతో కొత్తరోడ్డు వరకు క్యూలైన్లలో భక్తులు వేచి ఉన్నారు. ఆలయ అధికారులు తాగునీరు, వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జగన్నాథస్వామి ఆలయంలో సుమారు ఐదు వేల మందికి అన్నప్రసాదం అందించారు. ఆలయం వద్ద ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి


దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

దత్తత పిల్లల సంరక్షణకు కేంద్రం పటిష్ట చర్యలు

- రాష్ట్రాలు దత్తత నిబంధనలు పాటించాలి
- సేవలు మరింత మెరుగుపరచాలి
- ఎండబ్ల్యూసీడీ కార్యదర్శి అనిల్‌మాలిక్

మద్దిలపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దత్తత పిల్లల సంరక్షణకు కేంద్ర ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని భారత మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ (ఎండబ్ల్యూసీడీ) కార్యదర్శి అనిల్‌మాలిక్ పేర్కొన్నారు. గురువారం ఆంధ్ర విశ్వవిద్యాలయం వైవీఎస్ ఆడిటోరియంలో సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (సీఏఆర్ఏ), మహిళా శిశు అభివృద్ధి శాఖ సంయుక్తంగా నిర్వహించిన జాతీయ దత్తత అవగాహన కాన్‌క్లేవ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పిల్లల హక్కులను పరిరక్షించడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రతి బిడ్డకు, ముఖ్యంగా ప్రత్యేక అవసరాలున్న బిడ్డలకు శాశ్వత కుటుంబ వాతావరణంలో సురక్షితమైన పెంపకాన్ని అందించేందుకు ఎండబ్ల్యూసీడీ కృషి చేస్తోందన్నారు. పిల్లల సంరక్షణ చట్టం 2015, 2022 దత్తత నిబంధనలకు అనుగుణంగా సేవలను మెరుగుపరచడానికి రాష్ట్రాలు, ఏజెన్సీలు కృషిచేయాలని పిలుపునిచ్చారు. సామాజిక అపోహలు తొలగించడానికి వీలుగా దత్తతపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర మహిళా శిశు అభివృద్ధి కార్యదర్శి ఎ.సూర్యకుమారి మాట్లాడుతూ జాతీయ దత్తత అవగాహన మాసంలో భాగంగా ఈ ఏడాది దివ్యాంగ పిల్లల పునరావాసంపై దృష్టిసారించామన్నారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు కుటుంబ ఆధారిత సంరక్షణ లభించేలా ప్రత్యేక కార్యాచరణతో పనిచేస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరిందరప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో పిల్లల అవసరాలున్న కుటుంబాలు దివ్యాంగ పిల్లలను దత్తత తీసుకునేలా ప్రోత్సహించాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. అందుకు తగిన కార్యాచరణ రూపొందించుకుని సత్ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం దివ్యాంగ పిల్లలను దత్తత తీసుకున్న కుటుంబసభ్యులు, జిల్లా బాలల రక్షణ యూనిట్లు, బాలల సంక్షేమ కమిటీల ప్రతినిధులు వారి అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మహిళా, శిశు అభివృద్ధి కార్యదర్శి అనితా రామచంద్రన్, స్టేట్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (ఎస్ఏఆర్ఏ) ఏపీ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ సీఈవో భావనాసక్సేనా తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న అనిల్‌మాలిక్

ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలే

- సీపీఐ, న్యూ డెమోక్రసీ, ప్రజా సంఘాల ఆందోళన

మహారాణిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలుగురాష్ట్రాల్లో జల్, జంగిల్, జమీన్ కోసం ఉద్యమిస్తున్న ఆది వాసీలను, మావోయిస్టులను ప్రభుత్వాలు ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపుతున్నాయని సీపీఐ, సీపీఐ ఎంఎల్, న్యూ డెమోక్రసీ, ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. ఎన్‌కౌంటర్ పేరుతో సాగిస్తున్న హత్యాకాండకు వ్యతిరేకంగా గురువారం నగరంలో భారీ నిరసన చేపట్టారు. సరస్వతీ పార్కు నుంచి జగదంబా జంక్షన్ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ చేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, ప్రజా నాట్యమండలి కళాకారులు విప్లవ గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ అటవీ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు ఆదివాసీలను, మావోయిస్టులను చంపుతున్నారని ఆరోపించారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా, అతని భార్య రాజీ, మరో ఐదుగురిని, శ్రీకాకుళం జిల్లాకు చెందిన జోగారావుతో సహా మరో ఐదుగురిని చిత్రహింసలకు గురిచేసి చంపారన్నారు. ఇవన్నీ రాజ్యాంగ వ్యతిరేక హత్యలన్నారు. పోలీసులు మారేడుపల్లి ఎన్‌కౌంటర్‌పై కట్టుకథలు అల్లారన్నారు. ఆపరేషన్ కగార్‌కు అర్బన్ ప్రాంతాల్లో అపరేషన్ సంభవ్‌గా మరో పేరుపెట్టి 50 మందిని జైళ్లలో నెట్టారని, కేంద్ర కమిటీ కార్యదర్శి తిప్పిరి తిరుపతి, మరికొంత మందిని కాల్చి చంపుతారనే వార్తలు వస్తున్నాయన్నారు. ప్రభుత్వం చట్టబద్ధంగా వ్యవహరించాలని, ఎన్‌కౌంటర్లను హైకోర్టు సుమోటోగా స్వీకరించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు జేవీ సత్యనారాయణ మూర్తి, వై.కొండయ్య, ఎం.వెంకటేశ్వర్లు ఎస్కే రెహమాన్, ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ, ప్రజా సంఘాల సభ్యులు, కళాకారులు

పెయింట్ వేసేందుకు వచ్చి... నగలు కాజేశాడు

పెందుర్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇంటి పెయింటింగ్ పనులుకు వచ్చి కప్‌బోర్డులో బంగారు వస్తువులను అపహరించిన నిందితుడ్ని పోలీసులు అరెస్టుచేసి, ఆరు తులాల బంగార ఆభరాణలను స్వాధీనం చేసుకున్నారు. క్రైమ్ ఎస్ఐ సూరిబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వేపగుంట సింహపురి లేఅవుట్‌లో నేవల్ డాక్‌యార్డ్ విశ్రాంత ఉద్యోగి మానవెల్లి నూకరాజు గత నెలలో ఇంటికి పెయింటింగ్ పనులు చేపట్టారు. అక్టోబరు 19న చోడవరం ఫంక్షన్‌కు వెళ్లేందుకు బెడ్‌రూమ్ కప్‌బోర్డులో ఉంచిన బంగారు ఆభరణాల కోసం చూడగా కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు ఎస్ఐ సూరిబాబు విచారణ చేపట్టారు. ఈక్రమంలో అడివివరానికి చెందిన పొట్నూరు వినోద్‌కుమార్ కదలికలు అనుమానాస్పదంగా ఉండడంతో విచారించగా, నేరం అంగీరించాడు. అతడి వద్ద ఆరు తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని, అరెస్టు చేశారు.

పోలీసుల అదుపులో కిలాడీ లేడీలు

ఆటోలో ప్రయాణిస్తున్న మహిళల బ్యాగులను తస్కరించిన ఇద్దరు పాత నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.60 వేల విలువైన డైమండ్ రింగులు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. చినముషిడివాడ సప్తగిరినగర్‌కి చెందిన విక్రాల లలిత గత నెల 18న చెవులు కుట్టించేందుకు రామ్‌నగర్ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో డైమండ్ రింగ్స్ గల బాక్స్‌ను హ్యాండ్‌బ్యాగులో పెట్టి ఎన్ఏడీలో ఆటో ఎక్కారు. ఇంటికి వచ్చి చూసేసరికి బాగ్ కట్ చేసి ఉంది డైమండ్ రింగ్స్ బాక్స్ కనిపించలేదు. ఎస్ఐ సూరిబాబు కేసు దర్యాప్తు చేసి, సీసీ కెమెరాలు ఆధారంగా అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం గొట్లాం గ్రామానికి చెందిన రావుల గంగోత్రి (30), విజయనగరం జిల్లా కొత్తవలస మండలం చీడివలస గ్రామానికి చెందిన మేకల అప్పలనర్సయమ్మ (40)లను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. దీంతో వారిని అరెస్టు చేసి, చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు.



ఫెస్ట్‌లో నృత్యం చేస్తున్న విద్యార్థులు


ఆనందంతో కేరింతలు కొడుతున్న విద్యార్థినీ, విద్యార్థులు

ఉత్సాహంగా ముగిసిన ఏయూ ఎస్ఎఫ్ఐ ఫెస్ట్

మద్దిలపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టూడెంట్ ఫెస్ట్ గురువారం ముగిసింది. ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో నిర్వహించిన ఫెస్ట్‌లో విద్యార్థుల సాంస్కృతిక కళాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్ఎఫ్ఐ జాతీయ సహాయ కార్యదర్శి ఐసీ ఘోష్ మాట్లాడుతూ విద్యార్థులు సాంస్కృతిక రంగంలోనూ ప్రతిభ కనబరచాలన్నారు. సమస్యలపై ఎస్ఎఫ్ఐ సమరశీల పోరాటాలు చేస్తోందన్నారు. విద్యాభివృద్ధికికార్యచరణ రూపొందించుకుందన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ ఫెస్ట్‌లు విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయన్నారు. ఉద్యమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్‌మోహన్, ఉపాధ్యక్షుడు ఎల్.జె.నాయుడు, జిల్లా అధ్యక్షుడు జి.అజయ్, కార్యదర్శి డి.వెంకటరమణ, ఏయూ నేతలు కుసుమాంజలి, హర్షిత్, విద్యార్థులు పాల్గొన్నారు.

వీధి కుక్కల నియంత్రణ సిబ్బందికి రాబిస్ వ్యాక్సిన్

విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలో వీధికుక్కల నియంత్రణ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి గురువారం యాంటీరాబిస్ వ్యాక్సిన్‌ను వేశారు. జీవీఎంసీ వెటర్నరీ అధికారి డాక్టర్ ఎల్.రవికుమార్ ఆధ్వర్యంలో జీవీఎంసీ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 50 మందికి ముందుజాగ్రత్తగా ఏఆర్‌వీ వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో సహాయ వైద్యాధికారి డాక్టర్ ఎన్.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సిబ్బందికి వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

గుర్తు తెలియని వ్యక్తి మృతి

వేపగుంట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సింహాచలం ఆర్టీసీ డిపో ఎదురు రోడ్డులో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఎలా చనిపోయాడో తెలియాల్సి ఉంది. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. దీంతో గుర్తుతెలియని వ్యక్తిగా పోలీసులు కేసు నమోదు చేశారు. సమాచారం తెలిస్తే గోపాలపట్నం సీఐ నరసింగరావు 94440796020, 8331041648 నంబర్లకు సంప్రదించి వివరాలు తెలియజేయాలని కోరారు.

మత్స్యకారుల స్థితిగతులు మెరుగుపరుస్తాం

కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు

బీచ్ రోడ్డు, నవంబరు 27, (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల జీవన ప్రమాణాలు, స్థితిగతులు, ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచి వారి జీవితాల్లో కొత్త వెలుగులు తీసుకు వచ్చేందుకు కృషిచేస్తామని ఏపీ మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు పేర్కొన్నారు. ఫిషింగ్ హార్బర్‌లో గురువారం ఆయన పర్యటించారు. మత్స్య సంపదతో లక్షలాదిమంది ఉపాధి పొందుతున్నారన్నారు. ఎగుమతుల ద్వారా ప్రభుత్వానికి ఏటా రూ.కోట్ల ఆదాయం సమకూరుతోందన్నారు. మత్స్యకారులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. కాలుష్యం కారణంగా మత్స్య సంపద హరించిపోయే ప్రమాదం ఉందన్నారు. మత్స్యకారులకు రాజకీయంగా గుర్తింపునిచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. రూ. 17 కోట్లు విలువచేసే వేట సామగ్రి, బోట్లు సబ్సిడీపై అందజేసిందన్నా రు. అనంతరం మత్స్యకారుల సమస్యలను తెలుసుకున్నారు. జాలారిపేట ప్రభుత్వ పాఠశాలను సందర్శించి మౌలిక వసతులపై ఆరా తీశారు. ఆయన వెంట మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేషన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.లక్ష్మణరావు, కార్యదర్శి, బాలాజీ, మత్స్యశాఖ అధి కారి ఆశాజ్యోతి, బి.కొండబాబు, సీహెచ్ వీరన్న, టి.గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.


హార్బర్‌లో చేపలు పరిశీలిస్తున్న పెద్దిరాజు